7/6/2012

మన నిజ ఆత్మావిష్కారణ



అఖిల

అఖిల భారత పత్రిక

జూన్ 2012

ధ్యానం — శిష్యులకు మార్గనిర్దేశం

శ్రీమాతారవిందుల ప్రవచనములు

ప్రథమ భాగం

ద్వితీయ భాగం

తృతీయ భాగం

చతుర్ధ భాగం

పంచమ భాగం



శ్రీమాత

మొదట తెలుసుకోవలసిన విషయం

ఎప్పుడైతే దైవాన్ని అన్వేషించే మనిషి ఆ దుర్గమమైన, చేరలేనిదాని దిశగా అంచె లంచెలుగా తిరిగి ఆరోహించేందుకు ప్రయత్నం చేస్తాడో, అప్పుడతడు, అతనికున్న సమస్త జ్ఞానమూ, అతడికున్న మొత్తం అంతఃస్ఫూర్తీ ఈ అనంతంలో ఒక్క అడుగు కూడా ముందుకు తీసుకువెళ్ళలేవనే విషయాన్ని గురించి పట్టించుకోడు; అంతేకాక అతడు దేనిని అందుకోవాలనుకుంటున్నాడో, ఏదైతే తనకు చాలా దూరాన ఉందని విశ్వసిస్తున్నాడో, అది అతనిలోనే ఉందనే సంగతి కూడా అతనికి తెలియదు.

ఎందువల్లనంటే, అతడు ఆద్యమైనదానిని ఎంతైనా తెలుసుకోవాలంటే, తనలో ఈ ఆద్యమైనదాని ఎరుక లేకుండా ఏ విధంగా తెలుసుకోగలుగుతాడు?

తనను తాను అర్థం చేసుకుంటూ, తనను తాను తెలుసుకోవటం నేర్చుకుంటూ, అతడు ఆ పరమోత్కృష్టమైనదానిని దర్శించగలుగుతాడు, అప్పుడతడు బైబిలులోని పితరునిలాగా ఆశ్చర్యపూర్వకంగా "దేవుని గృహం ఇక్కడనే ఉంది, అయినా అది నాకు తెలియలేదు" అని ఎలుగెత్తి అరుస్తాడు.

అందువలననే మనం అవశ్యం ఆ దివ్యమైన తలంపును, భౌతికప్రపంచ సృష్టి కర్త్రిణిని "నేను సర్వవస్తువులందూ సర్వప్రాణులందూ ఉన్నాను" అనే వాక్కుతో వ్యక్తపరుస్తూ, స్వర్గమునూ, భూమినీ నింపేస్తూ అందరికీ తెలియపరచాలి. ఫలించునని చేసిన వాగ్దానం నెరవేరే రోజు వస్తుంది. పదార్థంలోని ప్రతి అణువులోను దైవం వసిస్తున్నాడన్న తలంపును మనుషులు గుర్తించిననాడు, జీవించే ప్రతి ప్రాణిలోను వారు దైవవ్యక్తీకరణకు సంబంధించిన ఏదో ఒక సంజ్ఞను అందుకున్ననాడు, ప్రతిమనిషి తన సోదరునిలో దైవాన్ని చూసినప్పుడు, అప్పుడు ఉషఃకాంతి ప్రసరించి, సమస్త విశ్వప్రకృతికి భారమైనటువంటి అంధకారాన్ని, అసత్యాన్ని, అజ్ఞానాన్ని, దోషాలను, బాధలను పటాపంచలు చేస్తుంది. కారణం, "మహాప్రకృతి సమస్తం, కష్టాలను భరిస్తూ, దుఃఖిస్తూ దైవపుత్రుల దివ్యజ్ఞానోపదేశానికై నిరీక్షిస్తూ ఉంటుంది."

ఇదే వాస్తవానికి, అన్నింటికీ తలమానికమైన అత్యంత ప్రధానమైన తలంపు. ఈ తలపే జీవనాన్నంతా తేజోమయం చేస్తున్న సూర్యునిలా మన జ్ఞాపకాలలో శాశ్వతంగా ఉండిపోవాలి.

అందువలననే దీనిని నేను ఈ రోజు గుర్తు చేస్తున్నాను. ఎందువల్లనంటే దీనిని

అత్యంత అరుదైన రత్నంలాగా, గొప్ప విలువైన పెన్నిధిలాగా, ఈ ఆలోచనను మన హృదయంలో ఉంచుకుంటూ మనం సాధనా మార్గంలో పయనిస్తే, మనలోనే మనల్ని ప్రకాశవంతం చేయడం, రూపమార్పిడి చేయడం అనే తన కార్యాన్ని తాను కొనసాగించడానికి మనం అవకాశం ఇస్తే, సమస్త ప్రాణుల హృదయమందూ, సమస్త వస్తుసముదాయము నందూ అది నివసిస్తున్నదని తెలుసుకొనడమే కాక, అందులోనే అద్భుతమైన ఏకత్వానుభూతినీ మనం పొందగలుగుతాం.

అప్పుడు మనం మన స్వాతిశయపు, క్రూరతనపు చేష్టల నిస్సారమైన సంతృప్తులనూ, మన అవివేకపూరిత పోట్లాటలనూ, మన అల్పమైన తీవ్రోద్వేగాలనూ, మన గుడ్డి దుర్మార్గపు ప్రవర్తనలనూ అర్థం చేసుకోగలుగుతాము. మన చిన్న చిన్న తప్పిదాలన్నీ కరిగిపోవటాన్నీ, మన పరిమిత వ్యక్తిత్వంతో, మన తెలివితక్కువ అహంభావంతో చివరిదాకా పేర్చుకుంటూ పోయిన సిద్ధాంతాలూ, వైఖరులూ అన్నీ ఛిన్నాభిన్న మైపోవడాన్ని మనం చూస్తాము. ఈ నిజమైన ఆధ్యాత్మిక ప్రవాహంలో కొట్టుకుపోయి, మనం మన సంకుచిత పరిమితుల నుంచీ, హద్దుల నుంచీ బయటపడిన అనుభూతిని అది మనకు కలిగిస్తుంది.

వ్యక్తిగత-ఆత్మ, విశ్వ-ఆత్మ ఒకటే; ప్రతి లోకంలోనూ, ప్రతి అస్తిత్వంలోనూ, ప్రతి వస్తుసంచయంలోనూ, ప్రతి అణువులోనూ దైవసన్నిధి ఉంది. దానిని అభివ్యక్తం చేయడమే మనిషి నిర్వహించవలసిన మహాకార్యం.

దానిని నెరవేర్చాలంటే, ఈ దైవసన్నిధి ఎరుకను అతడు కలిగి ఉండాలి. కొంత మంది వ్యక్తులకు దానిని అందుకోవటానికి తప్పనిసరిగా శిక్షణ అవసరమవుతుంది: వారు అహంకారంతో నిండిపోయిన అస్తిత్వంలో పూర్తిగా లీనమై వుంటారు, వారు రాజీపడని కాఠిన్యంతో ఆచారపరాయణులై ఉండటం మూలంగా దానికి వ్యతిరేకంగా వారి సంఘర్షణలు బాధామయమై చాలా కాలం కొనసాగుతాయి. ఎవరైతే తద్విరుద్ధంగా ఎక్కువగా వ్యక్తిత్వస్పృహ రహితులై, ఎక్కువ మృదుత్వం కలిగి, ఎక్కువ ఆధ్యాత్మికతను సంతరించుకుని ఉండి ఉంటారో వారు చాలా తేలికగా వారి అస్తిత్వంలోని తరుగులేని దైవాధార స్పర్శను పొందగలుగుతారు. కానీ మరచిపోగూడని విషయం ఒకటుంది. వారు కూడా నిత్యం, నిరంతరం దానిని ప్రయత్నపూర్వకమైన ఒక పద్ధతికి అనుగుణంగా మలుచుకుంటూ, పరివర్తనం చేసుకుంటూ తమను

తాము అంకితం చేసుకోవాలి, దాని ఫలితంగా వారిలోని మరి ఏదీ ఆ విశుద్ధ ప్రకాశజ్యోతిని కొడిగట్టించ లేదు.

కానీ ఒకసారి ఈ ప్రగాఢ చేతన స్థాయి కెదిగినపుడు ఎంత గొప్పగా మన దృక్పథం మారిపోతుందో, ఎంతగా అవగాహన విస్తృతమవుతుందో, ఎంతగా దయార్ద్రత ఇనుమడిస్తుందో!

మూలం: శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

దివ్యత్వపు పురోగమనాత్మక అభివ్యక్తి

విశ్వంలో కనిపించేవాటన్నింటి వెనక ఒక సత్ కూ, చిత్ కూ చెందిన అభివ్యక్త పరమ సత్యం, సర్వవస్తువులలో శాశ్వతము, ఏకము అయిన ఆత్మ ఉందనే సనాతన ఋషుల దార్శనికత నుండి శ్రీఅరవిందుల తత్త్వదర్శనం ప్రారంభమౌతుంది. జీవులన్నీ ఆత్మలో ఏకమైనా, అవి ఒక ప్రత్యేకతా చైతన్యం వలన విభజన పొంది మనో, జీవ, శరీరాలలో అజ్ఞానంచేత వాటి అసలైన ఆత్మనూ, యథార్థాన్ని తెలుసుకో లేవు. ఒక నిర్దుష్టమైన మనస్తత్వశిక్షణ వలన ఈ ప్రత్యేకతా చైతన్యమనే తెరను తొలగించి, అసలైన ఆత్మను, మనందరిలోనూ, అన్నింటిలోను ఉన్న దివ్యత్వాన్ని గురించిన ఎరుకను (awareness) పొందే అవకాశముంది.

ఏకైకం అయిన సత్ , చిత్ భూమి మీద పదార్థంలో ముకుళించుకున్నాయని శ్రీఅరవిందులు దర్శించి చెప్పారు. ఇది భూమి మీద పదార్థంలో ముకుళించుకొని ఉన్నదనిశ్రీఅరవిందులు దర్శించి చెప్పారు. ఇది పరిణామమనే పద్ధతి ద్వారా బయటకి వస్తుంది. అచేతనగా కనపడేదాని నుంచీ చైతన్యం వెలువడుతుంది. ఒకసారి బయటకు వచ్చాక స్వయం ప్రేరణతో ఉన్నతాల వైపుగా వృద్ధిచెందుతూ, అదే సమయంలో విస్తరిస్తూ మహనీయమైన పరిపూర్ణత వైపుగా సాగుతుంది. పదార్థం నించీ చైతన్యం వెలువడడానికి జీవం మొదటి మెట్టు. మనసు రెండవ మెట్టు. కాని మనసుతో పరిణామం పూర్తి కాదు. అది మనసు కంటె మహనీయమైన ఆధ్యాత్మిక మరియు అత్యున్నత అతిమానసిక చైతన్యంగా పరిణమించడానికి ఎదురుచూస్తోంది.

చైతన్యజీవిలో దివ్యచైతన్యం (Supermind), ఆత్మలు ప్రబలమైన శక్తిగా పనిచేసే దిశగా పురోగమించడం పరిణామం వేసే రెండవ అడుగు. ఇది జరిగినప్పుడే పదార్థంలో ముకుళించుకున్న దివ్యత్వం అన్నింటిలో తనని సంపూర్ణంగా వెలువరించుకో గలుగుతుంది. అప్పుడే జీవనానికి (Life) పరిపూర్ణతని అభివ్యక్తం చెయ్యడానికి సాధ్యపడుతుంది.

పరిణామపు తొలి అడుగులు మొక్కలో, జంతువులో ప్రకృతి చైతన్యపూర్వకమైన ఇచ్ఛతో జరగలేదు. ఉపకరణమైన మానవుడిలో ప్రకృతి చైతన్యపూర్వక ఇచ్ఛతో సమర్థవంతంగా పరిణామం చెందగలిగింది. అయితే పరిణామమంతా మానవుడిలో మానసిక ఇచ్ఛతో మాత్రమే జరగదు. ఎందుకంటే మనసు ఒక నిర్దిష్టమైన స్థితి వరకు మాత్రమే వెళ్ళగలదు. ఆ తరువాత అది వలయంలో మాత్రమే తిరుగుతుంది. మనసు దానికంటే ఉన్నత సూత్రంలోకి మారాలంటే అందులో ఒక సమూలమైన మార్పు, చైతన్యంలో మార్పు జరగాలి. ఈ పద్ధతి సనాతన మనస్తత్వ శిక్షణలో, యోగాభ్యాసంలో కనపడుతుంది. గతంలో ప్రపంచం నుండి ఉపసంహరించుకొని అత్యున్నతమైన ఆత్మలో లీనం కావడానికి ప్రయత్నం జరిగింది. ఆ ఉన్నతసూత్రం కిందికి దిగిరావడం సాధ్యపడుతుందనీ, ఆధ్యాత్మిక ఆత్మను ప్రపంచం నుండి విముక్తం చేయడమే కాక, దానిని ప్రపంచంలోనే ముక్తం చేస్తుందనీ, మనసుకున్న అజ్ఞానం లేదా పరిమితజ్ఞానం స్థానంలో అతిమానస సత్య-చైతన్యాన్ని (Truth-Consciousness) స్థాపిస్తుందనీ, అది అంతరంగ ఆత్మకి తగిన ఉపకరణంగా ఉంటుందనీ, మానవుడు తనను తాను క్రియాశీలంగానూ, (dynamic) అంతరంగం లోను తెలుసుకొని, తనలో ఇంకా ఉన్న జంతుమానవత్వం (animal humanity) నుంచి పైకెదిగి దివ్యజాతిగా (divine race) వృద్ధి చెందుతాడని శ్రీఅరవిందులు దర్శించి ప్రపంచానికి చాటారు.

మానవుడనే ప్రాణి జీవితం అతిసాధారణమైంది. అపరిపూర్ణ ఆలోచనల ఆధిపత్యం, ప్రేరణలు, సంవేదనలు (sensations), ఉద్వేగాలు, కోరికలు, ఆనందాలు, చేసే పనులన్నీ చాలావరకు అలవాటుగా చేసేవి, చేసినవే తిరిగి చేసేవిగా ఉంటూ సగం స్థిరమైనవై సగం అస్థిరమైనవై ఉంటాయి. కొంత భాగం కేవలం క్రియాశీలం, స్వయం సమృద్ధంగా ఉన్నా కూడా, అన్నీ ఉపరితల అహంను కేంద్రంగా చేసుకొంటాయి. ఈ కర్మల గమనమంతా అంతరంగ అభివృద్ధికి దోవ తీస్తుంది. ఈ అభివృద్ధి

కొంత ఈ జీవితంలో కనపడుతుంది. కార్యాచరణగా కూడా ఉంటుంది. ఈ అంతరంగ అభివృద్ధిలో కొంత రాబోయే జన్మలకి విత్తనమవుతుంది. చైతన్యజీవికి చెందిన ఈ అభివృద్ధి, విస్తారము, ఆత్మాభివ్యక్తి పెరుగుదల, వివిధ భాగాలలో అధికాధికమయ్యే సామరస్యతలే మానవ అస్తిత్వానికిగల పరిపూర్ణ అర్థము, సారము (pith). ఆలోచన, సంకల్పము, భావోద్వేగము, కోరిక, కర్మ, అనుభవాలు, చివరకు, ఒక సర్వోత్కృష్ట దివ్య ఆత్మావిష్కారానికి దారితీసే అర్థవంతమైన చైతన్య అభివృద్ధి కోసమే మానసిక జీవి అయిన ఒక మానవుడు భౌతిక శరీరాన్ని పొందాడు. మిగిలినదంతా అతని పరిణామానికి సహాయకం, విధేయం లేదా అనుకోకుండా వచ్చేది, అవసరం లేనిది. ఏదైతే అతని స్వభావం పరిణమించడాన్ని, పెంపొందడాన్ని పోషిస్తూ సహాయపడుతుందో ఇంకా చెప్పాలంటే, అతని ఆత్మ మరియు ఆత్మశక్తి పురోగమనాత్మక వికసనానికీ, అవి అధికాధికంగా బహిర్గతం కావడానికీ సహాయం చేస్తుందో దానినే మనం ప్రధాన విషయంగా పరిగణించాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. తెన్నేటి రాగరంజని

మొదట చేయవలసింది

మనిషి చాలామటుకు బాహ్యమనస్సులో, జీవితంలో, శరీరంలో జీవిస్తుంటాడు. కాని అతని లోపల ఇంకా గొప్ప సంభావ్యతను కలిగిన ఒక అంతరంగ అస్తిత్వం ఉంది, దానికి అతడు మేల్కొనాలి — కారణం, అతడు ప్రస్తుతం దాని నుంచి పరిమితమైన ప్రభావాన్నే పొందుతున్నాడు. అదే అతనిని అధికతరమైన సౌందర్యానికీ, సామరస్యతకూ, శక్తికీ, జ్ఞానానికీ నిరంతరం ముందుకు నెడుతూన్నది. కనుక యోగం యొక్క ప్రథమ ప్రక్రియ ఈ అంతరంగ అస్తిత్వపు శ్రేణులను జాగృతపరచడం, అంతరంగజ్యోతి, శక్తితో బాహ్యజీవితాన్ని శాసిస్తూ అచటి నుంచి బాహ్యజీవితాన్ని జీవించడం. ఆ విధంగా చేయడం వలన తన నిజాంతరాత్మను అతడు తెలుసుకుంటాడు, అది ఎటువంటిదంటే ఇప్పుడు బాహ్యంలో మానసికం, ప్రాణికం, భౌతికాంశాల బాహ్య మిశ్రణం లాంటిది కాదు, కాని వాటి వెనుకగాగల మహాసత్యానికి

సంబంధించినదేదో ఒకటి, దైవాగ్ని నుంచి వెలువడిన ఒక నిప్పురవ్వ, విస్ఫులింగం. అతడు తన అంతరాత్మలో జీవించడం నేర్చుకోవాలి, తక్కిన తన ప్రకృతినంతా పరమ సత్యం దిశగా నడుపుతూ శుద్ధి చేయాలి, అది స్థిరంగా అటువైపే నడిచేటట్లు చేయాలి. దాని తరువాత, ఊర్ధ్వం వైపు ఒక ఉన్మీలనం, పరమ పురుషుని అవరోహణ, దాన్ననుసరించి జరుగుతాయి.

అతని (శ్రీఅరవిందుల) ఉద్దేశం ఏదో ఒక మతాన్ని అభివృద్ధి చేయడం కాదు లేక మరీ పాతమతాలన్నింటినీ కలపడమూ కాదు లేక ఏదైనా కొత్తమతాన్ని స్థాపించడమూ కాదు, ఎందువల్లనంటే వీటిలో ఏదైనా అది అతని ప్రధాన ఉద్దేశం నుంచి దూరంగా తీసుకుపోయేదే. అతని యోగం యొక్క ఏకైక లక్ష్యం అంతరంగ ఆత్మ-పురోభివృద్ధి, ఫలితంగా దానిని అనుసరించిన ప్రతి వ్యక్తి కాలగమనంలో అందరిలోని పరమాత్మను కనిపెట్టగలుగుతాడు, అతడు మనస్సు కంటె అధికోన్నతమైన చైతన్యాన్ని వికసింపజేసుకుంటాడు, అది మానవ ప్రకృతిని మార్పునొనరించి, దివ్యం చేయగల ఆధ్యాత్మిక, అతిమానసిక చైతన్యం.

చేయవలసిన పని మనం మనంగా తయారుగావడం. కాని నిజమైన మనం మనలోనే ఉన్నది, ఆ ఉన్నత అస్తిత్వం, మన నిజమైన దివ్య అస్తిత్వం. అది తనను తాను బహిరంగపరచుకుని, క్రియాశీలం అవ్వాలంటే దానిని పొందటానికి దైహిక, ప్రాణిక, మానసిక, ఆత్మను అధిగమించడం ముందుగా జరగాలి. కేవలం అంతరంగం లోనికి వృద్ధి పొందుతూ, అంతరంగంలో జీవిస్తూంటేనే దానిని చూడగలుగుతాం; అది ఒకసారి జరిగిన తరువాత అక్కడి నుండి ఆధ్యాత్మిక లేక దివ్య, మనస్సును, జీవితాన్ని, శరీరాన్ని సృష్టించుకొనడానికి, ఈ పరికరాలతో దివ్యజీవనానికి కావలసిన నిజమైన పరిసరాలతో కూడిన లోకాన్ని సృష్టించుకోగలిగిన స్థాయికి చేరడం — దీనినే మనకు అంతిమ లక్ష్యంగా పరాప్రకృతి యొక్క క్రియాశక్తి మన ముందుంచింది. అయినప్పుడు ఇదే మన మొట్టమొదటి అత్యావశ్యకమైన విషయం, ఒక్క వ్యక్తే కాకుండా, ప్రతి వ్యక్తీ తనలోని ఆత్మనూ, దివ్యసత్యాన్నీ కనుగొనాలి. దానిని తన మొత్తం అస్తిత్వంలో, జీవితంలో వ్యక్తం చేయాలి. దివ్యజీవనం అంటే మొదటగా అన్నింటి కంటె ముందుగా అది ఆంతరిక జీవనం అయ్యి తీరాలి. ఎందువల్లనంటే తప్పనిసరిగా లోపల ఉన్నదాని వ్యక్తీకరణమే బాహ్యజీవితం. అంతరంగ అస్తిత్వం దివ్యం కాకపోతే బాహ్యజీవితంలో దివ్యత్వం ఉండబోదు. మనిషిలో దైవత్వం

అతని ఆధ్యాత్మిక కేంద్రంలో తెర మరుగై నివసిస్తున్నది; అతనిలో శాశ్వతమైన ఆత్మ, ఆత్మశక్తి వాస్తవంగా లేకపోతే మనిషి తనను తాను అధిగమించడం అనే ప్రసక్తే లేదు లేక అతని ఉనికికి అధికతరమైన నిష్కృతి ఏదీ ఉండబోదు.

*

కేవలం అంతరంగవృద్ధితోను, గమనంతోను, కర్మతోను మాత్రమే ఒక వ్యక్తి తన వ్యక్తిత్వానికి సార్వజనీనతనూ, అతీతత్వస్థితినీ స్వేచ్ఛగా, సమర్థంగా సాధించగలుగుతాడు. దివ్యజీవనానికి తప్పనిసరిగా కేంద్రమార్పిడీ, తక్షణం క్రియాశీల సామర్థ్యాన్నందించగల అంతరంగంలోని అస్తిత్వ మూలస్థానానికి బాహ్యం నుంచి మార్పిడి జరగాలి. ఎందువల్లనంటే, అక్కడ అంతరాత్మ ప్రతిష్ఠితమై ఉన్నది, కానీ అది తెర మరుగై లేదా సగం తెరమరుగై ఉంది, మనకు తక్షణం అందుబాటులో ఉన్న, మన కర్మకు మూలమైన అస్తిత్వం మాత్రం ప్రస్తుతం ఉపరితలంలో ఉన్నది. ఉపనిషత్తులో చెప్పబడినట్లు, మనుషులలో స్వయంభూః అయినవాడు చేతనా ద్వారాలను బాహ్యం వైపు తొలిచాడు. కాని కొంతమంది మాత్రం వారి చూపును అంతరంగం వైపుకు త్రిప్పుతారు. వారే పరమాత్మ శక్తిని దర్శించి, తెలుసుకొని, ఆధ్యాత్మిక అస్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోగలుగుతారు. కనుక, మన లోపలికి దృష్టి సారించి, చూసి, మన లోపలికి ప్రవేశించి, మన లోపల జీవించడం అనేది రూపాంతరీకరణకూ, దివ్యజీనవానికీ మొట్టమొదటి ఆవశ్యకత.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

మన నిజమైన ఆత్మ

మనం అని మనం చెప్పుకొనే ఈ చిన్ని మనస్సు, ప్రాణికం, దేహం కేవలం ఉపరి తలం మీది ఒక కదలికయే గాని మన నిజమైన 'ఆత్మ' యెంత మాత్రం కాదు. అజ్ఞానక్రీడ, స్వల్పకాలిక జీవితం కోసం ముందుకు తీసుకురాబడిన ఒక స్వల్పాంశ మాత్రమే. సత్యశకలాలకై తడబడుతూ అన్వేషించు ఒక అజ్ఞాన మనస్సు, క్షణిక సంతసాలకై పరుగులు పెట్టే అజ్ఞాన ప్రాణికం, బాహ్య సంపర్కాల ఆటుపోట్ల ఫలితమైన బాధ, సంతోషాలను తన అధీనం చేసుకొనడానికి బదులు వాటికి తలయొగ్గే అస్పష్టమైన ఉపచేతన, భౌతికాలను ఎక్కువగా కలిగినదే ఆ స్వల్పాంశం కూడా. మనస్సు తన ప్రస్తుత స్థితిని ఏవగించుకొని, తన, ఇతర వస్తువుల పరమసత్యం కోసం చూడడం ప్రారంభించేంతవరకు, ప్రాణికం తనను తాను ఏవగించుకొని నిజమైన ఆనందం అంటూ అసలేదైనా ఉన్నదా అని ఆశ్చర్యంగా వెదుకులాడడం మొదలు పెట్టేంతవరకూ, భౌతికం అలసి సొలసి, తాను, తన బాధలు, అల్ప ఆనందాల నుండి ముక్తం కావాలని కోరుకొనేంతవరకు అది దాన్నంతా ఆమోదించడమే జరుగుతుంది. అప్పుడే మనం అని చెప్పుకొనే మూర్తిత్వపు అల్పమైన అజ్ఞాన అంశానికి తన నిజమైన మహితాత్మ స్థాయికి చేరుకొనడం సాధ్యపడుతుంది — దానితోపాటు అవి కూడా ఆ మహోన్నతమైన స్థాయిలకు చేరడం సాధ్యమౌతుంది — లేదా తనను తాను లేకుండా చేసుకొనడం, నిర్వాణానికి చేరడం సంభవిస్తుంది.

నిజమైన మహితాత్మ ఉపరితలంలో యెక్కడా లేదు, కాని అంతరంగపు లోలోతునా, అస్తిత్వపు ఊర్ధ్వంలోనూ ఉంది. అచట విశ్వజనీనమైన వైశాల్యతను దానితోపాటు మన మిప్పుడు అర్థించినవి — తన చుట్టూ ఉన్న వాటి అసలు సత్యంతో సంపర్కం, విశ్వజనీన ఆనందపు రుచి, స్థూల భౌతిక దేహపు అల్పత్వం, దుఃఖానుభూతుల నుండి విడుదల — లభిస్తాయి. ఆంతర మనస్సును, ఆంతర ప్రాణికాన్ని, ఆంతర భౌతికాన్ని, ఈ ఉపరితల మూర్తిత్వం వెనుక మరేదో ఉన్నదనే విషయాన్ని, యూరపు దేశాలు సైతం చాలా తరచుగా అంగీకరిస్తున్నాయి. కాని అలా ఉన్నదాని యొక్క స్వభావం విషయంలో అవి పొరపడుతున్నాయి. దానిని అవి ఉపచేతన లేదా ఉపప్రజ్ఞగా చెప్తున్నాయి. నిజానికది తనదైన రీతిలో తాను చాలా యెరుకను కలిగి వుంది. అది ప్రజ్ఞకు వెనుక లేదు, కేవలం ఒక తెర వెనుక

మాత్రమే ఉంది. మన యోగసాధన వల్ల యెరుక పొందగల కొన్ని చేతనా కేంద్రముల ద్వారా బాహ్య అల్పమూర్తిత్వంతో అది కలుపబడి వున్నదని మన మనోవిజ్ఞాన శాస్త్రం చెబుతోంది. బాహ్య జీవితంలోనికి ఈ కేంద్రాల ద్వారా కొంచెంగా మాత్రమే మన అంతర అస్తిత్వం బహిర్గతమౌతోంది. ఆ కొంచెమే మన యొక్క అత్యుత్తమ అంశంగా భాసిస్తోంది. అదే కళలు, కవిత్వం, దర్శనశాస్త్రం, ఆదర్శాలు, మతపరమైన ఆకాంక్షలకు మూలం, జ్ఞానం కోసం, పరిపూర్ణత కోసం చేసే ప్రయత్నాలకు మూలం. కాని, ఆంతర కేంద్రాలు చాలా వరకు మూసుకుపోయి లేదా సుషుప్తిలో పడి వుంటాయి. వాటిని తెరవడం, మేలుకొలిపి చురుకుగా వుండేటట్లు చేయడం అనేది యోగం యొక్క ఒక లక్ష్యం. అది తెరుచుకొన్నపుడు, ఆంతర అస్తిత్వపు శక్తులు, సంభవతలు కూడా మనలో పెల్లుబుక్కుంటూ బయటకొస్తాయి. మొదట ఒక విశాల చేతనకు, తదుపరి ఒక విశ్వచేతనకు మనం మేలుకొంటాం. పరిమితమైన జీవితాలతో బ్రతికే అల్పమైన ప్రత్యేక మూర్తిత్వాలుగా ఇంక నెంత మాత్రం మిగి లిపోం. కాని విశ్వజనీన కర్మకు కేంద్రాలుగా విశ్వక్రియాశక్తులతో ప్రత్యక్ష సంబంధం కలిగి వుంటాము. పైగా ఉపరితలంలో మాత్రమే జీవించే వ్యక్తిలా విశ్వశక్తులకు యిష్టం లేని ఆటవస్తువులం కాదనే గాక, ప్రకృతి యొక్క క్రీడను గూడా కొంతవరకు తెలుసుకోగలుగుతాం, దానిని శాసించగలుగుతాం. ఇదెంత దూరం వరకూ పోతుంద నేది, ఆంతర అస్తిత్వపు అభివృద్ధి ...., ఉన్నతతర ఆధ్యాత్మిక స్థాయిలకు దాని ఉన్మీలనా పరిధి మీద ఆధారపడి ఉంటుంది. అదే సమయంలో హృదయకేంద్రం తెరచుకొని మన అంతరంగంలోని దైవం యొక్క మనకు ఊర్ధ్వంలో నున్న ఉన్నతతర పరమ సత్యం యొక్క యెరుకను పొందగలిగే వైపు తీసుకుపోయే చైత్యపురుషుని విడుదల జరుగుతుంది.

ఎందుకనంటే అత్యున్నత ఆధ్యాత్మిక పరమాత్మ, మన మూర్తిత్వం వెనుక, దైహిక ఉనికి వెనుక సైతం లేదు, కాని దాని ఊర్ధ్వాన, పూర్తిగా దాని నధిగమించి వున్నది. అత్యంత లోతున ఉన్న హృదయకేంద్రంలాగానే ఆంతరంలో అత్యంత ఉన్నతమైన కేంద్రం శిరస్సులో వుంది. కాని పరమాత్మకై సరాసరి తెరచుకొనే కేంద్రం శిరస్సుకు పైగా, పూర్తిగా భౌతికదేహానికి బయట సూక్ష్మశరీరమని చెప్పబడే దానిలో వుంది. ఈ పరమాత్మకు రెండు పార్శ్వము లున్నాయి. దాని సంసిద్ధి ఫలి తాలు ఈ రెండు పార్శ్వాలకు సంబంధించినవై ఉంటాయి. ఒకటి నిష్క్రియం,

విస్తృతమైన శాంతి, స్వేచ్ఛ, నిశ్చలనీరవతలకు సంబంధించిన స్థితి. నిశ్చల నీరవ పరమాత్మ ఎట్టి కర్మచేతగాని, లేదా అనుభవంచేత గాని ప్రభావితం కాదు. అది వాటికి ఒక నిష్పాక్షిక ఆధారం. కాని వాటికి తాను ఏమాత్రమూ మూలం కానట్లు కన్పిస్తుంది. అంతేకాక వాటికి ఉదాసీనమై వుంటుంది. విశ్వసంబంధ కర్మకు, ఈ లోకపు కర్మకు మరి ఇతర లోకాలకూ జగత్తు యొక్క భౌతికసీమల లాగానే, అతి భౌతికసీమలకు ఆధారమై యుండడమే గాక, ఉత్పత్తిస్థానమై, భరించునదై నిలిచే విశ్వ ఆత్మగా అనుభవమయ్యే సక్రియ పార్శ్వం రెండోది. భౌతికమైన మన కర్మకు సంబంధించినదే గాక, భౌతికమైన ఇతర లోకాల సమస్త కర్మ వెనుక నున్నదంతా కూడా అదే. పైగా పరమాత్మను సమస్తమందలి ఏకైకంగా సంవేదిస్తాం. అన్నింటికీ పైనున్నదానిగా, సమస్త వ్యక్తిగత జన్మలను లేదా విశ్వం యొక్క సమస్త ఉనికిని అతిశయించి వున్నదిగా సంవేదిస్తాం. సమస్త మందలి ఏకైకమైన విశ్వ ఆత్మను అహం నుండి ముక్తం చేయాలి. అపుడు చేతనలో ఒక చిన్న పరికరమైన స్థితిగా అహం తయారవుతుంది, లేదా మన చేతన నుండి పూర్తిగా అంతర్ధానమౌతుంది. అదే అహం యొక్క నశింపు లేక నిర్వాణం. సమస్తానికీ ఊర్ధ్వాన ఉన్న విశ్వాతీత ఆత్మలోనికి చేరేటందుకు చేసే ప్రయత్నం మనలను విశ్వచేతనకు కర్మకు, సైతం అతీతులం కాగల శక్తివంతులుగా చేస్తుంది. ప్రపంచ — ఉనికి నుండి సంపూర్ణంగా ముక్తం గావడానికది మార్గం అవుతుంది. దానినే లయం, మోక్షం, నిర్వాణం అంటారు.

ఏదేమైనా ఊర్ధ్వం వైపు ఉన్మీలనం అవశ్యం. శాంతి, నిశ్చల నీరవత, నిర్వాణానికి మాత్రమే కాదు దారితీసేవి అనే విషయం మనం గుర్తుపెట్టుకోవాలి. సాధకుడు, కాలక్రమంలో ఒక గొప్ప అనంత శాంతిని, నిశ్చల నీరవతను, మనపై నున్న వైశాల్యతను — అంటే శిరస్సు పైన ఉండే వైశాల్యతను — సమస్త భౌతిక, అతి భౌతిక స్థలం లోనికి విస్తరించుకొన్న యెరుకను పొందడం మాత్రమే గాక, ఇతరమైన సమస్త శక్తీ గల, ఒక బృహత్తర క్రియాశక్తి, సమస్త జ్ఞానమూగల ఒక బృహత్తర వెలుగు, సమస్త ప్రహర్షమూగల ఒక బృహత్తర ఆనందంల యెరుక లభిస్తుంది. ప్రప్రథమంలో అవి మౌలికమైనవి, అనిర్దేశ్యం, నిరపేక్షం,కేవలంగా కన్పిస్తాయి. వీటిలో దేనియందైనా నిర్వాణం పొందడం సాధ్యమే ననిపిస్తుంది. ఈ బృహత్తర క్రియాశక్తిలో సమస్త శక్తులూ ఉన్నాయనీ, ఈ బృహత్తర వెలుగులో సమస్త వెలుగులూ ఉన్నాయనీ, ఈ బృహత్తర ఆనందంలో సమస్త సంతసానందాలు సంభవమేననీ

మనం చూడగలిగిన స్థితికి కూడా చేరుకొంటాం. ఈ సమస్తం మన లోనికి దిగివస్తాయి కూడా.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

బాహ్య సత్త —అంతర్గత సత్త

పూర్తిగా మన సత్త అంతటిలో, అన్ని స్థాయిలలో బాహ్యచైతన్యమూ, అంతర చైతన్యమూ కూడా ఉంటాయి. సగటు మనిషికి తన బాహ్యవ్యక్తిత్వ ఎరుక మాత్రమే ఉంటుంది కానీ లోపల మరుగులో నున్నదేమిటో అసలు తెలియదు. అయినా బయట ఉన్నదేమిటో, అదే మనము అని దేన్నైతే అనుకుంటున్నామో, మనని గురించి అంతా తెలుసు అని దేనిని గురించి అనుకుంటున్నామో; అది మన పూర్తి సత్తలో (వ్యక్తిలో) లేశభాగం మాత్రమే. మిగిలినదే చాలా ఎక్కువ; అదంతా చాటున మరుగుబడి ఉంటుంది. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే ఉపరితల చైతన్యానికి వెనుక రహస్యంగా దాగి ఉంటుంది, రహస్య జ్ఞానం ద్వారా దాన్ని తెలుసుకోవచ్చు. ఆధునికమైన మనోవిజ్ఞానశాస్త్రము, మనస్తత్వ శాస్త్రములు ఈ విషయాన్ని ఇప్పు డిప్పుడే కొద్ది కొద్దిగా గ్రహిస్తున్నాయి. భౌతికపరమైన మనోవిజ్ఞాన శాస్త్రము మరుగున ఉన్న ఈ భాగాన్ని, నిజానికి అది బాహ్యచైతన్యసత్త కంటే, అధికతరమనీ, శక్తివం తమైనదనీ, ప్రగాఢమనీ అంగీకరించినప్పటికీ దానిని నిశ్చేతన అంటుంది. అంటే ఉపనిషత్తులు ఏ విధంగానైతే మన ఊర్ధ్వస్థచేతనను నిద్రాణ ఆత్మగా వ్యవహరించినప్ప టికీ ఆ నిద్రాణ ఆత్మే అవధుల్లేని మేధస్సు, సర్వజ్ఞత, సర్వశక్తి, ప్రజ్ఞగల ఈశ్వరశక్తిగా పరిగణిస్తాయో ఆ విధంగానే మానసిక విజ్ఞానశాస్త్రం కూడా ఈ గుప్తచైతన్యాన్ని ఉపప్రజ్ఞాత్మగా వ్యవహరిస్తుంది. ఇదే అత్యంత శక్తివంతమూ, జ్ఞానమయమూ, అయి బాహ్యంగా ఉన్న చిరువ్యక్తి కంటే స్వేచ్ఛగా చరించే అవకాశము కలది. కానీ నిజానికి వెనుక మరుగున ఉన్న చైతన్యం ఒక మహాసముద్రమైతే, మన జాగృతచైతన్యం కేవలం దాని ఒక అల లేదా అలల పరంపర వంటిది. దానిని ఏ ఒక్క మాటతోనూ వివరించలేము. అది ఒక సంకీర్ణత. దానిలో కొంత భాగమే

జాగృతచైతన్యం అడుగున ఉన్న అధోచేతన, లేదా ఉపచేతన. కొంతభాగం దానికి సమానస్థాయిలో ఉంటుంది కాని వెనుక నున్నది దానికంటే చాలా పెద్దగా ఉంటుంది, పైన ఉండే భాగం మన ఊర్ధ్వచేతన. మనం మనస్సు అనుకునేది బాహ్యంగా ఉండే మనస్సు, అదొక ఉపరితల మానసిక చర్య మాత్రమే; లోపల ఉండే విశాల మనస్సు యొక్క పాక్షిక వ్యక్తీకరణకు ఇది ఉపకరణం మాత్రమే. మనలోకి లోతుగా పరికించుకుంటే తప్ప సాధారణంగా దానిని తెలుసుకోలేము. ఆ విధంగానే మనం ప్రాణికం అనుకునేది కూడా బాహ్యమైనదే. అదే విధంగా మన దైహిక సత్త కూడా అదృశ్యంగా ఉండే ఘనమైన సూక్ష్మభౌతిక చైతన్యానికి బాహ్యంగా కనబడే విక్షేపణ మాత్రమే. ఆ సూక్ష్మభౌతికం చాలా సంకీర్ణమైనది, పరిజ్ఞానం కలది. విస్తృతంగా గ్రహించగలది, వికాసం కలది, నమ్యమైనది, స్వతంత్రమైనది.

ఈ నిజాన్ని అర్థం చేసుకొని అనుభవంలోకి తెచ్చుకోగలిగతే అంతర్గతమైన మనస్సు, అంతర్గత ప్రాణికము, అంతర్గతమైన భౌతిక చైతన్యములంటే ఏమిటో గ్రహించగలుగుతావు. అయితే ఈ అంతర్గతమనే మాట రెండు సందర్భాల్లో వాడటం జరుగుతుంది. ఒక్కొక్కసారి అది బాహ్యసత్త లోపలి మానసిక, ప్రాణికాల వెనక నుండే చైతన్యాన్ని సూచిస్తుంది. ఇది సార్వత్రిక మనస్సు, సార్వత్రిక ప్రాణశక్తులతో, సార్వత్రిక భౌతికశక్తులతో సరాసరి, అనుసంధానమై యుంటుంది. కొన్నిచోట్ల ఇంకా లోపలగా ఉండే మనస్సు, ప్రాణికము, భౌతికాలకు వర్తిస్తుంది. వాటినే అసలైన మనస్సు, అసలైన ప్రాణికం, అసలైన భౌతికచైతన్యంగా చెప్పుకోవచ్చు. అది ఆత్మకు సమీపంలో ఉండి దివ్యకాంతినీ, దివ్యశక్తినీ తేలికగా గ్రహిస్తుంది. ఈ బాహ్య వ్యవహారం నుంచీ, అంతరంగంలోకి వెళ్ళి అంతర్గత సత్త, అంతర్గత ప్రకృతి ఎరుక పొందితే తప్ప యోగము సాధ్యము కాదు, పూర్ణయోగం అసలే సాధ్యం కాదు. ఆలా పొందగలిగినప్పుడు మాత్రమే బాహ్యంగా వచ్చే తాకిడులను మాత్రం చైతన్యాత్మకంగా గ్రహించగల్గుతూ మిగతా విషయాలను బాహ్యమనస్సు, ఇంద్రియాల ద్వారా పరోక్షంగా తెలుసుకుంటున్న బాహ్యసత్త అవధులను ఛేదించగలుగుతాము; అప్పుడిక మన ద్వారానూ, మన చుట్టు ప్రక్కలా పనిచేసే సార్వత్రిక చైతన్యం, సార్వత్రికశక్తులను నేరుగా పొందగలుగుతాము. ఇంకా అప్పుడు మాత్రమే మనలోని దైవాన్ని తెలుసుకోగలిగి దివ్యకాంతి, దివ్యశక్తులను నేరుగా స్పృశించగలుగుతా మనుకోవచ్చు. అలా కానప్పుడు కేవలం బాహ్యసంకేతాల ద్వారా, బాహ్యసిద్ధుల

ద్వారా మాత్రమే భగవంతుని భావన పొందవలసి ఉంటుంది. అయితే అది కష్టసాధ్యము, సంశయాత్మకము అయిన పద్ధతి. ఇంకా అది అరుదుగా సాధ్యమవుతుంది. పైగా అస్థిరమయిన పద్ధతి. దాని వలన కేవలం నమ్మకమైతే కలుగుతుంది గానీ జ్ఞానానికి దారి చూపదు, అంతే కాక సూటైన చైతన్యానికీ, ఆ సర్వవ్యాపి సాక్షాత్కారానికీ దారితీయదు.

*

అంతర్గత చైతన్యమంటే అంతర్గతంగా ఉన్న మనస్సు, అంతర్గత ప్రాణికము, అంతర్గత దైహికము ఆ తర్వాత వాటి వెనకగా అంతరాంతరాళంలో ఉన్న చైత్య పురుషుడు. అదే అంతర్గతసత్త. అంతర్గతసత్త మనస్సే ఉన్నత మనస్సు కాదు; అది ఎక్కువగా సార్వత్రిక శక్తుల సంస్పర్శ బాగా ఉన్నటువంటిది, ఎక్కువ ఉన్నత చైతన్యాన్ని బాగా గ్రహించగలదీ, బాహ్యంగా ఉన్న ఉపరితల మనస్సు కంటే గాఢమైన, సువిశాలమైన పరిధిలో పనిచేయగల సామర్థ్యం కలదీ అయినప్పటికీ దాని మూలతత్వం బాహ్యమనస్సు వంటిదే. ఇక ఉన్నత చైతన్యం సాధారణ మనస్సుకు ఊర్ధ్వంగా ఉండి, పనిచేయటంలో దానికి భిన్నంగా ఉంటుంది. ఉన్నత మనస్సుకు పైన దీప్తివంత మనస్సు, దానిపైన స్ఫురణాత్మక మనస్సు, ఆ పైన అధిమనస్సు దాకా శ్రేణి కొనసాగుతుంది. అది అతిమానసపు అంచుల దాకా కొనసాగుతుంది.

*

నీవు బాహ్య చైతన్యాన్నే అసలైన వ్యక్తి లేక సత్తగా అనుకుంటూ అది కానప్పుడు ఇంకొకటేదైనా సిద్ధిని పొంది నిలకడగా ఉంటుందేమో ననుకుంటే జాగృత చైతన్యం తప్ప వేరొకటేదీ లేదు. ఈ తప్పిదం వల్లనే అజ్ఞానం ఆవహించి వదిలించుకోవడం కష్టమవుతుంది. ఈ అజ్ఞానం వదిలించుకోవాలంటే నిజాన్ని ఒప్పుకోవాలి; అదేమిటంటే ఈ బాహ్య చైతన్యమనేది ఆత్మా కాదు, తన వ్యక్తిత్వం కాదు, అసలు తానంటే అది కానే కాదు, అది కేవలం బాహ్య కార్యకలాపాల కోసం ఏర్పాటైన తాత్కాలిక కల్పన మాత్రమే. అంతరాత్మ, లోని పురుషుడు బయటకు ఉండదు. బాహ్యమూర్తి

త్వమే మనిషి అనేది (Personality) ఆ పదానికి మూలం లాటిన్ భాషలోని (persona) పర్సానా; అంటే ముఖానికి తొడుగు అనే అర్థము.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

అంతరాంతరాలలో అస్తిత్వ దీప్తి: చైత్యపురుషుడు

(దివ్య సంభవతలు గర్భితమైయున్న ఒక దివ్య కేంద్రము)

బాహ్యమైన మనస్సు కన్నా, బాహ్యమైన ప్రాణికంకన్నా, బాహ్యమైన భౌతికంకన్నా తెలియనిది ఎంతో ఉంది. అది అంతా అంతరంగ పురుషునికి, అంతర్గత మనస్సుకు, అంతర్గత, సూక్ష్మభౌతికానికి తెలుసు. మన లోపలి అస్తిత్వం ప్రకృతిలోని రహస్య శక్తులతో నేరుగా సంబంధం కలిగి ఉంటుంది. అందువల్ల పూర్ణజ్ఞానంతో అది భాసిస్తుంటుంది. అన్నింటికీ లోపల వున్నది చైత్యపురుషుడు. చైతన్యంలోని ప్రగాఢతత్వంలో సహజంగా వున్న సత్యం చైత్యపురుషునికి తెలుసు. సత్యం, శివం, సుందరం, దైవం — ఇవన్నీ దాని అధికార ప్రాభవ క్షేత్రంలోనివే.

*

మనలోని చైత్యపురుషుడు భగవంతుని నుండి నేరుగా ప్రభవిస్తుంది. భగవంతునితో సంబంధం కలిగి వుంటుంది. నిమ్న త్రిపుటి — జీవన, మనశ్శరీరాలకు ఆధారమై దివ్యసంభావ్యతలతో తేజరిల్లే కేంద్రబిందువు అది. అది ప్రారంభ దశ. జీవులందరిలోనూ ఈ దివ్యతత్వం ప్రదీపిస్తుంటుంది. కాని, సాధారణ చైతన్యపు పొరల వెనుక అది దాగి ఉంటుంది. అది మొదట అభివృద్ధి చెందదు. ఒకవేళ అభివృద్ధి చెందినా ఎల్లప్పుడూ, లేదా తరుచూ అది ప్రముఖంగా అభివ్యక్తం కాదు. మనశ్శరీరాల వంటి ఉపకరణాల అపరిపూర్ణత్వం అనుమతించిన మేరకు, వాటి ద్వారా, వాటి పరిమితులలో అది తనకు తాను వ్యక్తపరచుకొంటుంది. భగవదభిముఖమైన అనుభవం ద్వారా చైతన్యపరంగా అది వికాసం చెందుతుంది. మనలో ఉన్నతోన్నతమైన చైతన్యచలనం సంభవించి నప్పుడల్లా అది బలం పుంజుకొంటుంది. చివరికి ఉన్నతమైన ప్రగాఢమైన చైతన్య చలనాలన్నీ పోగుబడినప్పుడు, ఒక చైత్య వ్యక్తిత్వం రూపుదాల్చుతుంది.

దానినే మనం చైత్యపురుషుడని అంటాము. మనిషి ఆధ్యాత్మిక జీవనం వైపు తిరిగడానికి అసలు రహస్యకారణం అదే. అతనికి ఆధ్యాత్మిక జీవితంలో ఎక్కువగా సహాయపడేది అదే. అందువల్ల యోగాభ్యాసం ద్వారా దీనిని తన రహస్య అరల నుండి అగ్రభాగానికి తేవలసిన అవసరం ఉంది.


*

చైత్యపురుషుడే అంతరాత్మ, లేదా భగవదగ్నిశిఖ నుండి ప్రజ్వరిల్లిన విస్ఫులింగం, భూమిపై వ్యక్తి పరిణామానికి ఆధారంగా వుంటుంది. చైత్యపురుషుడంటే తనకు తాను వృద్ధిచెందుతున్న అంతరాత్మ — చేతన. భగవంతునితో సాయుజ్యం చెందడానికి సమస్తం సన్నద్ధం అయ్యేవరకు ప్రాణిక, మనశ్శరీరాలు తన ఉపకరణాలుగా జన్మజన్మలలో అది అభివ్యక్తమవుతుంది.

*

ఉన్నతమైన, లోపలి, పూర్ణ వినిర్మల ఆత్మకు (Pure self) జననం లేదు. జననమరణాల మార్గంలో అది ప్రయాణించదు. జననానికి, మనశ్శరీరాలకు, జీవనానికి, ఈ అభివ్యక్త ప్రకృతికి దూరంగా స్వేచ్ఛగా వెలిగే జ్యోతిస్సు అది. వాటి చేత అది బంధింపబడదు. పరిమితం కాదు. ఆ రూపాలను పైన వేసుకొన్నా, వాటికి ఆధారమైనప్పటికీ దానికి ఎటువంటి విఘాతం కలగదు. దీనికి విరుద్ధంగా అంతరాత్మ జన్మ ఎత్తుతుంది. మృత్యుద్వారంలో నుండి నడిచి వెళ్తుంది. అది అమృత స్వరూపం. అది చనిపోనప్పటికీ, ఒక భూమిక నుండి మరో భూమిక లోనికి, ఒక దశ నుండి మరో దశలోనికి, ఈ పృథ్వి భూమిక నుండి ఇతర భూమికలకు, తిరిగి భువన అస్తిత్వం వైపు ప్రయాణిస్తుంది. జీవదశలలో పరిణామాల ద్వారా అది పురోగమిస్తూ ఉంటుంది. ఈ పరిణామ పురోగతి దానిని మానవదశ వరకు నడుపుతుంది. పరిణామానికి ఆధారమైన చైత్యపురషుని రూపం పరిణమిస్తుంది. ప్రపంచ అనుభవాలను చవిచూపే తన ఉపకరణాలుగా భౌతిక, ప్రాణిక, మానస చైతన్యాన్ని అభివృద్ధి చేస్తుంది.

దాని స్వీయ వ్యక్తీకరణ అపరిపూర్ణ మైనట్లు, మారువేషం దాల్చినట్లు కనిపిస్తుంది. కాని అది లోపల వికాసం చెందుతుంటుంది. ఉపకరణాల అపరిపూర్ణత్వం అనుమతించే మేరకు మాత్రమే అది యవనిక వెనుక నుండి తన దివ్యాత్మ ప్రాభవాన్ని ప్రదర్శిస్తుంటుంది. అది యనవిక వెనుక నుండి బయటపడగల ఒక సమయం వస్తుంది. అన్ని ఉపకరణాలతో కూడిన మానవ ప్రకృతికి దివ్యసాఫల్యతను చేకూర్చుతుంది; నిజమైన



శ్రీఅరవిందులు

ఆధ్యాత్మిక జీవనానికి ఇది ప్రారంభదశ. మానవ చైతన్యదశను దాటి మరింత ఉన్నత చైతన్యదశను చేరడానికి అంతరాత్మ ఇప్పుడు సన్నద్ధం అవుతుంది. ఆధ్యాత్మిక శ్రేణుల ద్వారా అతిమానస దశకు చేరుకొంటుంది. అంతవరకు జననం పొందకుండా ఆగడానికి తగిన హేతువు కనిపించదు. నిజానికి జననం పొందకుండా ఉండలేదు. ఆధ్యాత్మిక శిఖరం చేరిన తరువాత పృథ్వీతలం నుండి తప్పుకోవాలని సంకల్పించి నట్లైతే అలాగే జరుగవచ్చు. కాని అజ్ఞానంలో కాకుండా జ్ఞానంలో ఉన్నత అభివ్యక్తీకరణ కూడా అప్పుడు సాధ్యపడుతుంది (జ్ఞానం — విద్య, అజ్ఞానం — అవిద్య).

*

ఉద్వేగమయ పురుషుని కేంద్రం వెనుక చైత్యపురుష కేంద్రం ఉంటుంది.

ఉద్వేగ అస్తిత్వం చైత్యపురుషునికి క్రియాత్మకంగా అతి సమీపంలో వుంటుంది. ఈ ఉద్వేగ కేంద్రం ద్వారా చైత్యపురుషుని తేలికగా చేరుకోవచ్చును. చైత్యీకరణ చెందిన ఉద్వేగం ద్వారా దానిని తేలికగా వ్యక్తం చేయవచ్చును. చాలామంది రెండింటిని సరిగా అర్థం చేసుకోలేరు. వాటి విషయంలో పొరపాటు పడతారు. రెండింటికి చాలా భేదం ఉంది. ఉద్వేగాలు స్వాభావికంగా ప్రాణికపరమైనవి. అవి చైత్యపురుష ప్రకృతిలో భాగం కాదు.

*

చైత్యపురుషునికి, దైవసాన్నిధ్యానికి తేడా వుంది. చైత్యపురుషుడు ఒక వ్యక్తిగత అంతరాత్మ — అస్తిత్వం. అది దైవం నుండి వచ్చినా అది దైవం కాదు. అది దైవం వైపు వికాసం చెందుతుంది.

*

మానస, ప్రాణిక భూమికల నుండి తన చేతనను ఇంకా ఉన్నతంగా సముద్ధరించి, పైనుండి ఆనందం, శక్తి, శాంతి, జ్ఞానాన్ని గైకొని రావచ్చు. ఇది చాలా కష్టం. ఫలి తాలు అనిశ్చితంగా వుంటాయి. మానవ అస్తిత్వం సన్నద్ధంగా లేకపోయినా, నిర్మ లంగా లేకపోయినా ఆ ప్రయత్నంలో ప్రమాదాలు సంభవించవచ్చు. చైత్యతత్త్వంతో ఉన్నత దిశగా అధిరోహించడమే ఉత్తమమైన పద్ధతి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

సాధకులకు సలహా

ఈ నూతనమార్గ ఆవిష్కరణ వ్యక్తిగతమైన సంగతి. గొప్ప నిర్ణయం, గొప్ప సంకల్పబలం, సడలని పట్టుదలతో సాధన చేయటం, ఆ లక్ష్యాన్ని చేరడానికి ఉండి తీరవలసిన ముఖ్య లక్షణాలు. ప్రతి వ్యక్తి తన యిబ్బందుల అనుభవాలలో నుండే మార్గాన్ని వెతుక్కుంటూ సాగాలి.

ఆ గమ్యం గురించి కొంతవరకు తెలుసు. ఎందుకనంటే ఆ గమ్యాన్ని చేరినవాళ్లు చాలామంది ఇప్పటికే ఆ మార్గాన్ని చాలావరకు స్పష్టంగా వర్ణించారు. ఐతే ఈ ఆవిష్కరణలోని అత్యంత ఉన్నతమైన విలువ మానసిక నియమనిబంధనలకు అందని సహజత్వంలోను, నిష్కపటత్వంలోను ఉంటుంది. అందుకే ఎవరైనా ఈ సాహసం చేయడాన్ని కోరుకుంటే, అంతకు ముందు ఆ మార్గంలో విజయవంతంగా సాగినవారి కోసం, తను ఈ మార్గంలో నిలదొక్కుకుని, కావలసిన జ్ఞానాన్ని పొందడానికి సహాయపడే మార్గదర్శకుని కోసం అన్వేషిస్తాడు. అయినా కొందరు ఒంటరి ప్రయాణీకులు ఉంటారు, వారికి ఈ సామాన్య సూచనలు ఉపయోగపడవచ్చు.

దీన్ని ప్రారంభించడానికి కావలసిన మొదటి విషయం: నీ కివ్వబడిన శరీరం, నీ జీవనపరిస్థితులు, నీ భాష, నీ అలవాట్లు, నీవు జీవిస్తున్న వాతావరణంలోని ఆచారవ్యవహారాలు, నీవు పుట్టిన దేశం, లేదా నీవున్న కాలం నుండి రూపొందిన మానసిక రూపకల్పన మీద కాక వీటి మీద ఆధారపడని దాని కోసం అన్వేషణ. నీ అస్తిత్వ గాఢలోతుల్లో ఓ విశ్వజనీనత, ఓ అపరిమిత విస్తృతత్వం, నిరవధికంగా సాగే ఓ సత్యం యొక్క ఉనికిని, నీవు కనుక్కోవాలి. అప్పుడు నీవు, అని నీవనుకొంటున్న ఆ కేంద్రంలోంచి బయటపడి విస్తరించి, వ్యాపించగలవు, అన్ని విషయాల్లోను, అన్ని జీవుల్లోను జీవించగలవు. వ్యక్తుల్ని విభజించే అడ్డుగోడలు కూలిపోతాయి. వారి ఆలోచనలు నీవు గ్రహించగలవు, వారి సంవేదనలు నీలో ప్రకంపిస్తాయి. వారి మనోభావాలు నీకు విదితమౌతాయి. నీ జీవితంలో అందరి జీవితం ప్రతిఫలిస్తుంది. అంత దాకా జడంగా కనిపించిన ప్రతీదానిలో జీవం తొణికిసలాడుతుంది, రాళ్ళు స్పందిస్తాయి, చెట్లు అనుభూతి చెందుతాయి, సంకల్పిస్తాయి, బాధపడతాయి. జంతువులు పూర్తిగా మాట్లాడలేకపోయినా, వాటి భాషలో అవి మాట్లాడతాయి — అంతటా ఓ జాగృత సజీవ చైతన్యాన్ని దర్శించగలవు. ఇది కాలము, పరిమితిలేని చైత్యపురుష సాక్షాత్కా

రంలోని ఒక అంశం మాత్రమే. ఇంకా చాలా చాలా ఉన్నాయి. ఇవన్నీ నీవు నీ అహం గోడల్ని కూల్చి ఎదగడానికి, ఆ ఉన్నత తీరాలు చేరడానికి, నీ వ్యక్తిత్వపు బాహ్యపరిధుల్ని కూల్చడానికి, నీ ప్రతిక్రియలలోని నిర్వీర్యత్వాన్ని, నీ సంకల్పంలోని అసమర్థతని దాటి వెళ్ళడానికి సహకరిస్తాయి.

నేనింతకు ముందే చెప్పినట్టు ఆ సాక్షాత్కారానికి చేర్చే మార్గం సుదీర్ఘమైనది, కఠినమైనది, సమస్యలతో, ప్రమాదాలతో నిండి ఉంటుంది. ఆ మార్గంలో సాగడానికి దృఢనిశ్చయం అవసరం. అది ఒక నూతన ప్రదేశాన్ని కనుక్కొందుకు ఓ నిర్జనారణ్యం లోంచి పరమావిష్కారం కోసం చేసే సాహసయాత్ర లాంటిది. ఈ చైత్యపురుషను కనుక్కోడం కూడా అలాంటి గొప్ప సాహసమే. దానికి కూడా నూతన ఖండాలను కనుక్కొనే వారి కుండాల్సిన దూరదృష్టి, సహనం ఉండాలి. ఆ మార్గంలో వెళ్ళాలని నిర్ణయించుకున్నవారికి ఈ చిన్న సలహా ఉపయోగకరం కావచ్చు.

ఇందులో మొదటిది, బహుశ అత్యంత ప్రధానమైన విషయం ఏమిటంటే మనసుకు ఆధ్యాత్మిక విషయాలను విచారణ చేసే సమర్థత లేదు అని తెలుసుకోడం. ఈ విషయం గురించి వ్రాసిన వాళ్ళందరు అదే మాట చెప్పారు. అయితే దీనిని ఆచ రణలో పెట్టినవాళ్లు అతి తక్కువమంది. అయినా ఆ మార్గంలో కొనసాగాలంటే, మానసికమైన ఉద్దేశ్యాల నించి, ప్రతిచర్యల నించి పూర్తిగా విడిపడి ఉండడం తప్పక అనివార్యమౌతుంది.

వ్యక్తిగతమైన సుఖం, తృప్తి, సరదాలు సంతోషాల కోసం ప్రాకులాడకుండా వాటిని త్యజించాలి. అభివృద్ధిని కోరే ప్రజ్వలించే జ్వాలవి కావాలి. మార్గంలో ఏ పరిస్థితి ఎదురైనా, దాన్ని నీ అభివృద్ధికి సహాయపడే అవకాశంగా తీసుకో. దాన్ని వెంటనే ఈ అభివృద్ధికి సాధనంగా చేసుకో. నీవు చేసే ప్రతి పనిలో సుఖానుభూతిని పొందు, కాని సుఖానుభూతి కోసం మాత్రం ఎన్నడూ పనిచేయకు.

ఎన్నడూ ఉద్వేగానికి లోనుకాకు, నీరసపడకు లేదా కలత చెందకు. అన్ని పరి స్థితులలోను సంపూర్ణమైన నిశ్చలత్వంతో ఉండు. అప్పుడు కూడా ఇంకా నీవు పొందాల్సిన అభివృద్ధిని గురించి తెల్సుకుందుకు సిద్ధంగా ఉండు. దాన్ని సాధించ డంలో కాలహరణం చేయకు.

భౌతికంగా జరిగే విషయాలని వాటి పైపై స్వరూపాన్ని బట్టి అంచనా వేయకు.అవి ఎల్లప్పుడూ మరొక విషయాన్ని బహిర్గతం చేయడానికి చేసే వికృత ప్రయత్నం.

వాస్తవం ఎప్పుడూ పై పైన మాత్రమే అర్థం చేసుకోగలిగే మన దృష్టికి అందదు. లోతుగా చూడలేని మన అజ్ఞానం నించి వాస్తవం తప్పించుకుంటుంది.

ఎవరి ప్రవర్తన గురించీ ఫిర్యాదు చేయకు. అతడు అలా ప్రవర్తిస్తున్నందుకు అతడి స్వభావంలో ఉన్న కారణం తెల్సుకుని, నీలో అది మార్చగలిగే శక్తి ఉంటే అతడిని మార్చడానికి ప్రయత్నించు. నీవు ఏ పనిచేస్తున్నా, ఎల్లవేళలా నీ లక్ష్యాన్ని మాత్రం జ్ఞాపకం ఉంచుకో. ఈ గొప్ప నూతనావిష్కరణా యాత్రలో ఒక్కసారి బయలుదేరాక చిన్న, పెద్ద, అన్న విషయం లేదు, అన్ని విషయాలు ఒకే రకమైన ప్రాముఖ్యతను కల్గి ఉంటాయి. అది ఏదైనా మనం విజయాన్ని సాధించడంలో — ఆలస్యం జరిగేటట్లు చేయగలదు, లేదా శీఘ్రంగా సాధించబడేటట్లు చేయగలదు. ఆ విధంగా నీవు ఆహారం తీసుకునే ముందు కొన్ని సెకన్లు ఏకాగ్రతతో, ఆ ఆహారం నీ శరీరానికి శక్తి నిచ్చి, నీ ఈ గొప్ప సాహసయాత్రలో నీ కృషికి కావల్సిన ధృడత్వాన్ని, సహనాన్ని ఇవ్వాలని ఆకాంక్షించాలి.

నిద్రపోయే ముందు కొన్ని సెకన్లు ఆ నిద్ర నీ అలసిన నరాలను ఉపశమింపచేయాలని, నీ మెదడుకు నెమ్మదిని, ప్రశాంతతని సమకూర్చాలని, నీవు మళ్ళీ కొత్తశక్తిని పుంజుకుని ఉత్తేజంతో ఈ నూతన పథంలో సాగాలని ఆకాంక్షపై నీ ఏకాగ్రత నిలిపి ఉంచు.

నీవు ఏ పనినైనా ప్రారంభించడానికి ముందు, ఆ పని నీకు సహాయపడాలని, నీ ఈ నూతన మార్గంలో అన్ని అవరోధాలను తొలగించాలని ఏకాగ్రతతో ఉండు.

నీవు మాట్లాడేటప్పుడు, నీ నోటితో ఆ మాటలు ఉచ్ఛరించడానికి ముందు ఒక్కసారి వాటిని గమనించి, పూర్తిగా అవసరమైనవాటినే పలికే విధంగా కొంచెం సేపు ఏకాగ్రతతో ఉండు. నీ ఈ గొప్ప నూతన ఆవిష్కరణ మార్గంలో ఏ విధమైన హాని కల్గించనివి మాత్రమే పలకాలి.

మొత్తం క్రోడీకరిస్తే నీ జీవితలక్ష్యాన్నీ, ప్రయోజనాన్నీ ఏనాడూ మరువకు. ఈ గొప్ప ఆవిష్కరణకు అత్యంత ఉన్నతమైన సంకల్పం ఉండాలి. అది నిన్ను మించినదై ఉండాలి అంటే నీవెవరైనా, ఏం చేస్తున్నా వాటికి పైగా విహరించే ఓ విశాల కాంతివిహంగం వలె నీ అస్థిత్వపు కదలికల్ని గమనిస్తూ ప్రభావితం చేయగల స్థితిలో ఉండాలి.

శ్రీమాత

ప్రశ్న: మనం లోపలి దైవాన్ని ఎలా కనుక్కోగలం?

మొట్టమొదట అతనికై నీవు అన్వేషణ ప్రారంభించాలి. ఆ తరువాత అదే నీ జీవితంలో అత్యంత ముఖ్యమైన విషయం కావాలి. నిరంతరం అదే సంకల్పంతో ఉండాలి, ఆకాంక్ష ఎల్లవేళలా నిలవాలి, ఆ ఒక్క వ్యాపకమే నీ జీవితధ్యేయం కావాలి. అదే నీ నిజమైన కోరిక కావాలి. అప్పుడు నీవు అతడిని కనుగొనగలవు.

కాని ఎవరైనా వారి జీవితంలోనే ఓ అయిదు నిముషాల పాటు దాని గురించి ఆలోచించి, ఆ తరువాత ముప్పావుగంట మిగిలిన విషయాలతో తీరిక లేకుండా ఉన్నపుడు విజయానికి ఎక్కువ అవకాశం లేదు. అప్పుడు ఎలాగూ అనేక జన్మలు పడుతుంది. అది ఏదో కాలక్షేపం కోసం సాగించే వ్యాపకంగా ఉండకూడదు. అది వారి అస్తిత్వం యొక్క మరే మినహాయింపులేని వ్యాపకం కావాలి. అదే వారి అస్తిత్వ కారణం కావాలి.

*

మొట్టమొదటి ఆవశ్యకత — దైవం కోసం ఆకాంక్ష

తరువాత చేయాల్సిన విషయం దాన్ని పెంచడం, ఎల్లప్పుడు అప్రమత్తతతో, జాగృతంగా, సజీవంగా ఉండేలా దాన్ని పోషించడం. దానికి కావలసినది ఏకాగ్రత — ఆ దైవం పైన మాత్రమే దృష్టి నిలపడం. ఆ దైవసంకల్పం, ప్రయోజనం సిద్ధించాలన్న ఉద్దేశ్యంతో సమగ్రమైన, సంపూర్ణమైన శక్తులన్నీ ముడుపుగట్టి దానిపై దృష్టి నిలపడం.

హృదయంపై ఏకాగ్రత నిలుపు. దాని లోతుల్లోకి వెళ్ళు, మరింత లోతుల్లోకి వెళ్ళు, లోపలి గూఢ లోతుల్లోకి.... సుదూరంగా, వెళ్ళగలిగినంత దూరం వెళ్ళు. చెదిరిన నీ చైతన్యం యొక్క తంత్రులన్నీ పోగుచేసుకుని, వాటిని కూడగట్టి, అందులోకి దూకి, బాగా లోతుల్లో మునకలు వేయి.

ఆ గూఢ నిశ్శబ్ద హృదయంలో ఓ జ్వాల రగులుతోంది. అదే నీలోని దైవత్వం — నీ నిజమైన అస్తిత్వం. ఆ వాణిని విను. ఆ ఆజ్ఞను పాలించు.

శ్రీమాత

స్వీయచైతన్యపు ఎరుక కలిగి ఉండడం, దానిని చైత్యపురుషతో ఐక్యం చేయడం

ప్రశ్న: మధుమయి మాతా! 'హృదయంలో ఏకాగ్రత' అని మీరు చెప్పినపుడు దాని అర్థం మనసుతో ఏకాగ్రత అనేనా?

చైతన్యం, మనస్సు కాదు, చైతన్యం!

నేను హృదయంలో ఆలోచించమని చెప్పలేదు. నేను ఏకాగ్రత వహించు అని చెప్పాను. శక్తిని ఏకాగ్రం చేయడం, చైతన్యాన్ని ఏకాగ్రం చేయడం, సంకల్పాన్ని ఏకాగ్రం చేయడం. ఒకే చోటికి కేంద్రీకరించడం. ఒక్క ఆలోచన కూడా లేని గాఢమైన ఏకాగ్రత ఎవరైనా పొందవచ్చు. సాధారణంగా అది మనలో ఆలోచనలు లేనపుడు మరింతగా గాఢంగా ఉంటుంది. (నిశ్శబ్దం) స్వీయ-నియంత్రణని, తగుమాత్రం జ్ఞానాన్ని సాధించాలంటే కూడా ఈ ఏకాగ్రత తప్పనిసరి. చైతన్యాన్ని మొత్తం ఒక చోట నిలిపి, దాన్ని తన అస్తిత్వంలో మిగిలిన భాగాల్లోకి పంపగలిగితే, అంటే అతని చైతన్యానికి, అతని ఆలోచనకు సంవేదనకు, ప్రేరణలకు మధ్య ఉన్న భేదాన్ని తెలుసుకోగలిగే విధంగా పంపగలిగితే, అప్పుడు అసలు చైతన్యం స్వతఃగా ఏమిటో దాని యొక్క ఎరుక కలుగుతుంది. ఆ విధంగా చైతన్యాన్ని ఒక చోటి నుండి మరో చోటికి ఎలా పంపవచ్చో నేర్చుకోగలడు. అతడు చైతన్యాన్ని శరీరంలో, ప్రాణికంలో, చైత్యపురుషలో (అది ఉండవల్సిన ఉత్తమ స్థానం) పెట్టగలడు. మనసులో పెట్టవచ్చు, దానిని మనసు పైకి కూడా ఉద్ధరించవచ్చు. తన చైతన్యంతో అతడు విశ్వంలోని అన్ని ప్రదేశాలకు వెళ్ళవచ్చు.

దీనికి ప్రథమంగా ఎవరైనా వారి చైతన్యం ఏమిటో తెల్సుకోవాలి. అంటే అతని చైతన్యాన్ని గురించిన ఎరుక అతనికి ఉండాలి. దాన్ని ఒక్క చోట నిలిపి ఉంచాలి. దానికి అనేక రకాల శిక్షణ పొందవచ్చు. వాటిల్లో ఒక్కటి మాత్రం అందరికి తెలిసినదే. అది, తనను తాను పరిశీలించుకోడం, తన జీవిత విధానాన్ని గమనిస్తూ ఉండడం. అప్పుడు అస్తిత్వం యొక్క చైతన్యం నిజంగా ఈ శరీరమేనా అని పరికించాలి, అది దేహం ఎంతమాత్రం కాదు, దేహం వ్యక్తం చేసేది మరిదేన్నో అనేది గ్రహించినపుడు అతడు తన ప్రేరణల్లో ఉద్వేగాల్లో ఉన్నదేనా 'నేను' అంటే అని వెతకాలి — అది కూడా కాదని తెలుసుకుంటాడు. ఆ తరువాత తన ఆలోచనల్లో

స్వీయచైతన్యపు ఎరుక కలిగి ఉండడం, దానిని చైత్యపురుషతో ఐక్యం చేయడం

ప్రశ్న: మధుమయి మాతా! 'హృదయంలో ఏకాగ్రత' అని మీరు చెప్పినపుడు దాని అర్థం మనసుతో ఏకాగ్రత అనేనా?

చైతన్యం, మనస్సు కాదు, చైతన్యం!

నేను హృదయంలో ఆలోచించమని చెప్పలేదు. నేను ఏకాగ్రత వహించు అని చెప్పాను. శక్తిని ఏకాగ్రం చేయడం, చైతన్యాన్ని ఏకాగ్రం చేయడం, సంకల్పాన్ని ఏకాగ్రం చేయడం. ఒకే చోటికి కేంద్రీకరించడం. ఒక్క ఆలోచన కూడా లేని గాఢ మైన ఏకాగ్రత ఎవరైనా పొందవచ్చు. సాధారణంగా అది మనలో ఆలోచనలు లేనపుడు మరింతగా గాఢంగా ఉంటుంది. (నిశ్శబ్దం) స్వీయ-నియంత్రణని, తగుమాత్రం జ్ఞానాన్ని సాధించాలంటే కూడా ఈ ఏకాగ్రత తప్పనిసరి. చైతన్యాన్ని మొత్తం ఒక చోట నిలిపి, దాన్ని తన అస్తిత్వంలో మిగిలిన భాగాల్లోకి పంపగలిగితే, అంటే అతని చైతన్యానికి, అతని ఆలోచనకు సంవేదనకు, ప్రేరణలకు మధ్య ఉన్న భేదాన్ని తెలుసుకోగలిగే విధంగా పంపగలిగితే, అప్పుడు అసలు చైతన్యం స్వతఃగా ఏమిటో దాని యొక్క ఎరుక కలుగుతుంది. ఆ విధంగా చైతన్యాన్ని ఒక చోటి నుండి మరో చోటికి ఎలా పంపవచ్చో నేర్చుకోగలడు. అతడు చైతన్యాన్ని శరీరంలో, ప్రాణికంలో, చైత్యపురుషలో (అది ఉండవల్సిన ఉత్తమ స్థానం) పెట్టగలడు. మనసులో పెట్టవచ్చు, దానిని మనసు పైకి కూడా ఉద్ధరించవచ్చు. తన చైతన్యంతో అతడు విశ్వంలోని అన్ని ప్రదేశాలకు వెళ్ళవచ్చు.

దీనికి ప్రథమంగా ఎవరైనా వారి చైతన్యం ఏమిటో తెల్సుకోవాలి. అంటే అతని చైతన్యాన్ని గురించిన ఎరుక అతనికి ఉండాలి. దాన్ని ఒక్క చోట నిలిపి ఉంచాలి. దానికి అనేక రకాల శిక్షణ పొందవచ్చు. వాటిల్లో ఒక్కటి మాత్రం అందరికి తెలిసినదే. అది, తనను తాను పరిశీలించుకోడం, తన జీవిత విధానాన్ని గమనిస్తూ ఉండడం. అప్పుడు అస్తిత్వం యొక్క చైతన్యం నిజంగా ఈ శరీరమేనా అని పరి కించాలి, అది దేహం ఎంతమాత్రం కాదు, దేహం వ్యక్తం చేసేది మరిదేన్నో అనేది గ్రహించినపుడు అతడు తన ప్రేరణల్లో ఉద్వేగాల్లో ఉన్నదేనా 'నేను' అంటే అని వెతకాలి — అది కూడా కాదని తెలుసుకుంటాడు. ఆ తరువాత తన ఆలోచనల్లో

కలిసిపోయి, గజిబిజిగా ఉండకూడదు. అది వాటినే చైతన్యంగా భావించకూడదు. ఆలా మోసపోకూడదు.

ఎవరైనా తన గురించి ఆలోచించినపుడు (తప్పనిసరిగా లక్షలాది మానవుల్లో పదవ వంతు మాత్రం మరొక రకంగా ఉంటారు) అతడి ఆలోచనలో "నేనంటె... నా శరీరం, ఇలా ఉన్న నా శరీరాన్ని నేనంటాను, నేనిలా ఉన్నాను, నా పక్కింటతను అలా ఉంటాడు అని ఆ శరీరానికి అపాదించి మాట్లాడుతారు. నేనింకో మనిషి గురించి మాట్లాడితే, నేను అతని శరీరం గురించే మాట్లాడతాను". ఆ విధంగా ఈ స్థితిలో ఉన్నంత కాలం అతడు స్వయంనిగ్రహం లేక అన్నిరకాల కదలికల ఆటవస్తువుగా అయిపోతాడు.

శరీరం నిజానికి చివరి సాధనం, దానినే ప్రతి ఒక్కడూ అంతర్విచారణ ప్రారంభిం చేంత వరకూ 'నేను' గా ప్రతిపాదిస్తోనే వుంటాడు ఎంతో కాలం దాకా.

మూలం:శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

చైత్యపురుష సత్తలో ప్రవేశానికి మనోచిత్రాల ఉపయోగము

సాధన ప్రారంభదశలో చైత్యపురుష సత్త ఒక గట్టి చిప్పలో మూయబడినట్టి లేక జైలుగోడల మధ్య బందీగ నున్నట్టి అనుభూతి కలుగుతుంది. అందువలన అది బాహ్యంలో ప్రకటితమగుటకు, బాహ్యచైతన్యంతో నిరవధిక చేతనాయుత సంబంధం నెలకొల్పుటకు ఇదే ఆటంకమౌతున్నట్టి అనుభూతి కలుగుతుంది. అది ఒక పెట్టెలో మూయబడి ఉన్నందున లేక జైలులో బంధించబడి ఉన్నందున దానిని చేరుటకు పెట్టెమూతను బలవంతంగ తెరవాలనే లేక జైలుగోడలను కూలగొట్టాలనే భావన కలుగుతుంది. గోడలు కూలద్రోసి, ద్వారం తెరువగలిగితే బందీగ ఉన్న చైత్యపురుష సత్తకు విమోచన కలిగించి దానికి బాహ్యంగ ప్రకటితమయ్యే వీలు కలిగించవచ్చు. ఇదంతా భావచిత్రీకరణ. అయితే ప్రతి మనిషి ఆతని స్వీయభావానుగుణంగా,

తనదైన పద్ధతిని, కొద్దిపాటి మార్పులు చేర్పులతో తన వ్యక్తిగత దైవరూపకల్పన గావించుకోవచ్చు.

ఆలాంటి అనుభవానికి లోనైన వారందరికి ఇట్టి భావచిత్రాలు కొన్ని ఒకే విధంగా ఉంటాయి. ఉదాహరణకు, ఒక వ్యక్తి సరిగ్గా తన చేతన అట్టడుగునగల చైత్యపురుష సత్తను కనుగొనుటకు తన అస్తిత్వపు లోతుల్లోనికి పోయినపుడు ఒక లోతైన నూతి లోనికి దిగుతున్న రూపం అనుభూతమౌతుంది. లోతుల్లో యధార్థంగా మునిగిపోతు న్నట్టి చిత్తరువు మనోఫలకంపై రూపొందుతుంది.

సహజంగా ఇవన్నీ సాదృశ్యాలు. అయితే అనుభవాలకు దృఢమైన వాస్తవికతను, శక్తిని సమకూర్చే అనుభూతులతో సన్నిహిత సాంగత్యము కలిగినవి.

వ్యక్తికి తన అంతరంగ అస్తిత్వము యొక్క, వివిధ భాగాల అన్వేషణలో, లోనికి పోయినపుడు అతనికి తరచు తాను ఒక విశాల ప్రాంగణంలోకి లేక గదిలోకి ప్రవేశిస్తున్న అనుభూతి కలుగుతుంది. అచటి రంగు, వాతావరణం, అచట నున్న వస్తువులు మొదలగువాటిని బట్టి, తన అస్తిత్వంలోని ఏ భాగంలో పర్యటిస్తున్నాడో స్పష్టమైన అవగాహన కలుగుతుంది. అప్పుడు తలుపులను తెరుచుకుంటూ ఒక గది నుండి మరొక గదిలోకి, ఆ పైన లోలోపలి గదుల లోనికి ప్రవేశించి వాటిలోని ప్రత్యేకతలను గమనించవచ్చు. ఇది తరచుగా రాత్రులందు సంభవము. ఆ పైన ఒక దృఢమైన దృశ్యం, ఒక కల లాంటిది, రూపొందుతుంది. తాను ఒక ఇంటిలోకి ప్రవేశిస్తున్నట్లు. అది తనకు సుపరిచితమైనట్లు అనుభూతి కలుగుతుంది. సమయ సందర్భాల ననుసరించి, ఇంటి లోపలి పరిస్థితి మారవచ్చు. కొన్నిసార్లు అంతా చిందరవందరగ, పగిలిన వస్తువులతో అస్తవ్యస్తంగా ఉండవచ్చు. కొన్ని సమయాల్లో ఇల్లంతా చక్కగా తీర్చిదిద్దబడి వస్తువులన్నీ తగు స్థానాల్లో అమర్చబడి పరిశుభ్రంగా ఉండవచ్చు. ఈ రెండు సమయాల్లో కూడా ప్రవేశించిన గృహం ఒకటే. ఈ ఇల్లు నీ అంతరంగ అస్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. అక్కడ నీవు గమనించిన దానిని బట్టి, నీవు చేసినదానిని బట్టి, నీ మానసిక ప్రవృత్తి యొక్క సంకేతాత్మక చిత్రం రూపొందు తుంది. పరిస్థితిని స్పష్టపరచుటకు అది చాలా ఉపయుక్తం. అయితే అది మనుషులను బట్టి ఉంటుంది.

కొందరు కేవలం మేధావులు మాత్రమే. వారికి విషయాలన్నీ భావనారూపంగానే ప్రకటితమౌతాయి. కాని చిత్తరువులుగా కాదు. కాని వారు వాస్తవిక వస్తుప్రపంచంలోకి

అడుగిడినా కూడ విషయాల యదార్థస్థితిని పరిగణనలోకి తీసుకొనక ఊహా ప్రపంచంలోనే విహరిస్తూ మనోసీమలలోనే నిరవధికంగా ఉండిపోతారు. అభివృద్ధి చెందుతున్నామని అనుకుంటారు. కానిఅలా అని దాన్ని పూర్తిగా నిర్ధారించలేకపోయినా మనస్సుకు సంబంధించినంతవరకు అది జరిగింది.

మనస్సు పురోగతిని సాధించుటకు వేలసంవత్సరాలు పట్టవచ్చు. ఎందుకనగా అది నిరంతరం క్రొత్తదనాన్ని సంతరించుకునే అనిశ్చితమైన విస్తృత క్షేత్రం. అయితే ప్రాణిక, భౌతిక, స్తరాలలో అభివృద్ధి సాధించాలనుకుంటే, నిర్దిష్ట కార్యక్రమాన్ని రూపొందించుటకు మనోరూపకల్పన చాలా ఉపయోగపడుతుంది. సహజంగానే సంకల్ప మాత్రాన అది నెరవేరదు. అది వ్యక్తి యొక్క స్వభావంపై ఆధారపడుతుంది. కాని ఎవరైతే చిత్తరువుల ద్వారా కేంద్రీకరించగల శక్తిని కలిగి ఉంటారో, అట్టివారి కిది మరింత ఎక్కువగా ఉపయోగపడుతుంది.

మూయబడిన ద్వారం ముందు — కంచుతో తయారుచేయబడిన దృఢమైన ద్వారం ముందు — ధ్యానానికి కూర్చొని, అది తెరచుకోవాలని, ఆవలకు వెళ్ళగలగాలని సంకల్పించాలి. అందువలన పూర్తి ఏకాగ్రత, పూర్తి ఆకాంక్ష రెండూ కలసి ఒక దృఢమైన ఆకాంక్షా కిరణంగా రూపొంది ద్విగుణీకృతమైన బలంతో ఆ ద్వారాన్ని నెట్టి, నెట్టి, నెట్టి, చివరకు ఆ ద్వారం భళ్ళున తెరచుకొనేటట్లు బలం పెంచుకుంటూ నెట్టాలి. అప్పుడతడు అందులోకి ప్రవేశిస్తాడు. అది ఒక అత్యంత శక్తివంతమైన ముద్ర వేస్తుంది. వ్యక్తికి తాను ఒక వెలుగు సంద్రంలో మునిగినట్టి అనుభూతి కలుగుతుంది. ఒక్క ఉదుటున సమూలంగా మార్పుచెందిన చేతన యొక్క భోగానుభవం సిద్ధిస్తుంది. జ్వాజ్వల్యమానమైన కాంతిపుంజాలు అతనిని కమ్ముకుంటాయి. తాను మరొక మనిషిగా మారుతున్న భావన ఏర్పడుతుంది. వ్యక్తికి తన చైత్యపురుష సత్తాతో సంపర్క మేర్పరచుకొనుటకు ఇదొక ఘనిష్టమైన శక్తివంతమైన మార్గము.

(CWM Vol. 2, pp. 270-72)

మూలం శ్రీమాత

అనువాదం అందుగులపాటి కైలాసపతి, జానకి

అంతరంగ సాక్షీభూత చేతనా వైఖరి

నీలో మానసిక, ప్రాణికాలు సక్రియంగా పనిచేస్తూ, నీవెప్పుడూ వాటి కార్యకలాపాలతో ఒకటిగా కలిసిపోయి ఉంటూ వుంటే క్రమ్మివున్న పొర కూడా ఎప్పటికీ అలాగే ఉంటుంది. కానీ నిన్ను నీవు వాటి చేష్టల నుండి వేరు చేసుకుని, అవి నీకు చెందినవే కావని, ప్రకృతిలో జరిగే యాంత్రిక కార్యకలాపంగా వాటిని అనాసక్తంగా, సాక్షీమాత్రంగా ఉండి పరిశీలించడం కూడా సాధ్యమే. అప్పుడు వేరుగా, నిర్మలంగా, ప్రకృతిలో ఏమాత్రం జోక్యం చేసుకోకుండా లోలోపలే వున్న ఆంతరవ్యక్తిని గుర్తించవచ్చు. కానీ అది చైత్యపురుషుడు కాకపోవచ్చు. అయితే అంతర్గత మనోమయ పురుషుడు లేదా ప్రాణమయ పురుషుడో అవ్వొచ్చు. కానీ ఆంతరిక మనోమయ పురుషుడి లేదా ప్రాణమయ పురుషుడి చేతనను పొందడం అసలు చైత్యపురుషుడ్ని ప్రత్యక్షపర్చుకోవడానికి చేసే ప్రయత్నంలో ఒక మెట్టు ఎక్కడం లాంటిది. అంతరంగ సాక్షీభూత చేతన — (సాధనలో బాహ్యామైన ఏకాంత జీవనం అవసరమని నేననుకోను. కావాలనుకుంటే అలా కూడా వుండవచ్చు.) — పురోగతిలో అత్యావశ్యకమైన దశ అవుతుంది. ఇది నిమ్నప్రకృతి నుండి విడివడడానికి, మామూలు స్వభావంలోని కదలికలతో కలిసిపోకుండా వుండడానికి సహకరిస్తుంది. అంతర్గతంగా శాంతిని, సంపూర్ణమైన నిశ్చలతను నెలకొల్పుకోవడానికి దోహదపడుతుంది. ఎందు చేతనంటే అక్కడి అంతర్గత వ్యక్తిత్వంలోని ఒక అంశం దేనికీ అంటుకొనకుండా, ఉపరితలం నుండీ ఏర్పడే అలజడికి చలించకుండా వుండి అంతటినీ చూస్తూ వుంటుంది. అది ఉన్నత చేతనలోకి పురోగమించడానికి, ఆ ఉన్నత చేతన క్రిందిగి దిగిరావడానికి సహాయపడుతుంది. ఎందుకనంటే ఈ విధమైన నిశ్చలత, బంధరహితమైన, స్వేచ్ఛా యుతమైన ఆంతర వ్యక్తిత్వం ద్వారా ఆరోహణ, అవరోహణలు చాలా తేలికగా జరుగుతాయి. ఇదే మాదిరి సాక్షీమాత్రమైన దృష్టితో ఇతరులలో జరిగే ప్రకృతి క్రియాకలాపాన్ని చూస్తూ, అర్థం చేసుకొంటూ వుంటూ కూడా, ఏమాత్రం వాటికి చలించకుండా ఉండటమన్నదే... ఆంతరవ్యక్తి, స్వాతంత్ర్యానికి, విశ్వాత్మానుభవానికి ఒక గొప్ప దోహదకారి అవుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: హర్షవర్ధన్

చైత్య రూపాంతరీకరణము

"మానసికాన్వేషణ సజీవ ఆధ్యాత్మికానుభవంలోకి పరివర్తన చెందడానికి అనుసరించవలసిన శిక్షణావిధానం ఏమిటి?" అని మీరు నన్ను అడిగారు. మొట్టమొదట మీ చైతన్యం మీలోనే ఏకాగ్రతని సాధించేటట్టు సాధన చెయ్యడం అవసరం. సామాన్య మానవుడి మనస్సు తన వుపరితల కార్యకలాపం మీదే పనిచేస్తూ నిజమైన ఆత్మని ముసుగులో కప్పేస్తుంది. కాని ఇంకొకటుంది. అది ఉపరితలం వెనుకనే చాటుగా దానిలోనే దాగివున్న చైతన్యం. అందులోనే మనం నిజమైన ఆత్మని తెలుసుకోగలం. ప్రకృతి యొక్క విశాలమైన, గంభీరమైన సత్యమదే అని తెలుసుకోగలం. అందులోనే మనం ఆత్మను నిజం చేసుకొంటాం. దానిని ప్రకృతి నుండి ముక్తం చేసి స్వభావాన్ని పరివర్తన చెందించగలం. ఉపరితల మనస్సుని నిశ్శబ్దం చేయడం, అంతరంగంలో నివసించ నారంభించడం ఈ ఏకాగ్రతా లక్ష్యం. ఈ ఉపరితల చైతన్యం కంటె వేరైన యధార్థమైన చైతన్యం యొక్క ప్రధాన కేంద్రాలు రెండున్నాయి. ఒకటి హృదయంలో (అది భౌతిక అవయవమైన గుండె కాదు. వక్షోమధ్యంలో గల హృదయకేంద్రం). ఇంకొకటి శిరస్సులో వుంటాయి. హృదయంలో ఏకాగ్రత, లోనికి తెరుచుకొంటుంది. లోపలి వైపుకు తెరుచుకున్న యీ దారి ననుసరించి యింకా లోలోపలికి పోతే అంతరాత్మని లేక చైత్యపురుషుని తెలుసుకోగలుగుతాం. అదే మనిషిలోని దివ్యాంశ. ముసుగు తొలగించబడిన యీ దివ్యాంశ మనిషి స్వభావాన్ని శాసించడానికి దానిని, దానికి సంబంధించిన సమస్తాన్నీ పరమ సత్యం వైపు, దైవం వైపు మళ్ళించి నడుపడానికి, ఊర్ధ్వంలో ఉన్న సమస్తాన్నీ దానిలోనికి ఆవాహన చేయడానికి ముందుకు రావడం మొదలుపెడ్తుంది. దైవసన్నిధి యొక్క చైతన్యాన్ని తీసుకొస్తుంది. అత్యున్నతమైనదానికి అస్తిత్వం మొత్తం అంకితమయ్యేలా చేస్తుంది. ఉన్నత స్తరాలలో మన కోసం వేచివున్న మహత్తర క్రియాశక్తి, చైతన్యం మన ప్రకృతిలోకి దిగివచ్చేటట్టు ఆహ్వానిస్తుంది. హృదయకేంద్రంలో ఏకాగ్రత సాధించడానికి దైవానికి ఆత్మసమర్పణతో, ఆంతర్యం లోనికి తెరుచుకోవాలనే ఆకాంక్షతో హృదయంలో దివ్యసమక్షం కోసం హృదయకేంద్రంలో ఏకాగ్రం కావడం మొదట జరగాలి. అది జరిగినట్టయితే అదే సహజమైన ప్రారంభం అవుతుంది. ఎందుచేతనంటే, ఒక్కసారి దాని ఫలితాన్ని పొందగలిగితే అది ఆధ్యాత్మిక మార్గాన్ని మరో విధంగా

ఆరంభించినదాని కన్న చాలా చాలా తేలిక మరియు సురక్షితం చేస్తుంది.

*

హృదయ కేంద్రంలో ఏకాగ్రత యొక్క శక్తి ఆ కేంద్రం తెరచుకొనేటట్లు చేస్తుంది, ఆకాంక్ష, ప్రేమ, భక్తి, సమర్పణ యొక్క శక్తిచే అంతరాత్మని దాచి వుంచిన ముసుగును తొలగించి అంతరాత్మను లేదా చైత్యపురుషుని ముందుకు తీసుకు వస్తుంది. మనస్సుని, ప్రాణికాన్ని, శరీరాన్ని శాసించి వాటిని దైవం వైపు మళ్ళించి, పూర్తిగా ఉన్మీలనం చేసి, అటువంటి మళ్ళింపును, ఉన్మీలనాన్ని అడ్డగించే సమస్తాన్ని తొలగిస్తూ ముందుకు తీసుకువస్తుంది. ఈ యోగంలో దీనిని చైత్యరూపాంతరీకరణ అంటాము.

ఆంతర్య ఏకాగ్రతలో ఇమిడి వున్న అంశాలు:

1. చైతన్యం హృదయంలో స్థిరపరచబడడం. దివ్యమాత యొక్క భావన రూప లేక నామాల్లో ఏది మనకి సులభంగా అనిపిస్తే దాని మీద కేంద్రీకరించడం.
2. హృదయంలో ఏకాగ్రత ద్వారా క్రమక్రమంగా మనస్సుని ప్రశాంతపరచడంలో ప్రగతి సాధించడం.
3. హృదయంలో దివ్యమాత దర్శనం కోసం తీవ్ర ఆకాంక్ష మరియు ఆమెచే మనస్సు, జీవితం, చేసే పనులు శాసించబడడం.

కాని మనస్సుని నిశ్శబ్దం చేయడానికి కావలసిన ఆధ్యాత్మిక అనుభవం పొందడా నికి మొట్టమొదట మన స్వభావాన్ని నిర్మలం చేసి సిద్ధం చేసుకోవడం అవసరం. ఇది కొన్ని సమయాల్లో సంవత్సరాలు పట్టవచ్చు. సరియైన దృక్పథంతో వోపికగా పని చేయడమే అత్యంత సులభమైన మార్గం. అంటే ఎటువంటి కోరికా అహం లేకుండా కర్మ చెయ్యాలి. ఇవి ఒక వేళ తలెత్తినా వాటిని ఆమెకు నైవేద్యంగా అర్పించాలి. ఆంతర నిశ్చల నీరవతలోనే గాక కర్మ క్షేత్రమైన బాహ్యంలో కూడా ఆమె సాన్నిధ్యాన్ని ఆమె కర్మ చేయడాన్ని అనుభూతి చెందగలిగేటట్లు ఆమె స్మరణతో, కర్మను చేపట్టడానికి ఆమె క్రియాశక్తిని అభివ్యక్తం చేయమని ఆమెను ప్రార్థించాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

అంతరంగంలోనికి సాగే పయనం యొక్క ప్రథమ ఫలితం

ఆంతరంగంలోనికి పయనించడం అనేక భిన్నమార్గాల ద్వారా జరుగుతుంది. పూర్తి నిమజ్జనపు సమస్త చిహ్నాలు కలగలిసిన ఒక సంక్లిష్టమైన అనుభవం కూడా కొన్ని సమయాల్లో ప్రాప్తిస్తుంది. లోనికి పోతున్నట్లు లేదా లోలోతునకు క్రిందికి పోతున్న భావన, ఆంతరిక లోతుల వైపుకు దిగుతున్న సంవేదన కలుగుతాయి. ఒక నిశ్చలత, స్పర్శ నెరుగని సుఖస్థితి, అవయవాలు బిగుసుకుపోయినట్లు కూడా తరచుగా అనుభూతి కలుగుతుంది. ఊర్ధ్వం నుండి ఒక క్రియాశక్తి కలిగించే వత్తిడి వల్ల దేహం నుండి, అంతరంగం వైపుకు ఉపసంహరించుకొంటున్న చేతనకు చిహ్నాం ఇది. అంటే ఆంతరిక జీవితానికీ ఒక చలనరహితమైన ఆధారంగా, ఒక విధంగా బలీయమైన నిశ్చలమైన ఆసనంగా, చలించని ఆధారంగా ఆ వత్తిడి దేహాన్ని అప్పటి కప్పుడు సుస్థిరం చేస్తోందన్న మాట. బాహ్య అచేతనను ఆంతరిక జాగృతిని కొని తెస్తున్న అలలు శిరసును చేర పైకెగసి వస్తున్న అనుభూతి కూడా కలుగుతుంది. ఊర్ధ్వంలోని ఉన్నతతర చేతనను చేరుకొనడానికి ఆధారంలోని నిమ్నచేతన ఆరోహణ అది.

*

ఆంతరిక అస్తిత్వం మేలుకొనడం మొదలయ్యే దశ ఒకటుంది. అందులో తరచుగా ఈ క్రింద తెలిపిన అంశాలతో తయారైన తొలి ఫలితం వుంటుంది.

1. జరుగుతున్నవాటిని ఆంతర చేతన చూస్తూ వుండే, పరిశీలిస్తూ వుండే, కాని వాటి యందే మాత్రం ఆసక్తి చూపని లేదా ఆనందాన్ననుభవించని ఒక ప్రేక్షకునిగా, లేదా పరిశీలకునిగా ఉండే ఒక రకమైన సాక్షిత్వ వైఖరి వుంటుంది.
2. కేవలం ప్రశాంతస్థితే తప్ప విచారానందాలు లేని తటస్థ సమతా స్థితి వుంటుంది.
3. జరుగుతున్న దానంతటి నుండి విడవడిపోయి దానిలో భాగస్వామి గాకుండా దానిని పరిశీలిస్తున్న భావన ఉంటుంది.
4. వస్తువులు, జనం, లేదా సంఘటనలతో ఎట్టి రాగబంధం లేని స్థితి వుంటుంది.

ఇటువంటి పరిస్థితి నీలో చోటుచేసుకొన ప్రయత్నిస్తున్నట్లు కన్పిస్తోంది. కాని అదింకా అపరిపూర్ణస్థితే. ఉదా: ఈ స్థితిలో 1. మనుష్యులు మాట్లాడుతున్నపుడు

ఏవగింపు, లేదా అసహనం, లేదా కోపం ఉండవు. ఉండేవల్లా ఉదాసీనత, ఆంతరిక శాంతి, నిశ్చల నీరవత మాత్రమే. ఇంకా 2. కేవలం తటస్థ ప్రశాంతత, ఉదాసీనత మాత్రమే గాక, సద్భావాత్మకమైన స్థిరత, నిస్సంగత్వం, శాంతి ఉంటాయి. పైగా 3. ఏం జరుగుతున్నదో లేదా నీవేం చేస్తున్నావో నీకు తెలియనివిధంగా దేహం నుండి బయటకు వెళ్ళడం వుండదు. దేహాన్ని కాదనీ, మరిదేన్నో అనే స్పృహ ఉండవచ్చు — అది మంచిదే. నీలో లేదా నీ చుట్టూ జరుగుతున్న దానంతటినీ గురించి ఒక పరిపూర్ణమైన యెరుక తప్పక వుండాలి.

పైగా ఇది పరిపూర్ణ స్థితైనప్పటికీ అది కూడా మారిపోయే స్థితే — కాని ఒకానొక స్థితికి సంబంధించిన స్వేచ్ఛను, ముక్తిని తీసుకురావడానికి ఉద్దేశించబడింది. అటువంటి శాంతిలో దైవసన్నిధి యొక్క అనుభూతి, దివ్యజనని శక్తి నీ మీద పనిచేస్తున్న స్పృహ, సంతోషం లేదా పరమానందం స్పృహ లభించాలి.

శిరస్సులో లాగానే హృదయంలో కూడా నీవు ఏకాగ్రతను నిలుపుకోగలిగితే, అప్పుడు ఇవి అనాయాసంగా ప్రాప్తిస్తాయి.

*

సమస్త చలనాలు, పైపైన జరుగుతున్నట్లుగా, విలువ లేనివిగా, అంతరాత్మతో ఎట్టి సంబంధం లేనివిగా కన్పించే స్థితి, ఉపరితల చేతన నుండి ఆంతరిక చేతనకు జరిగే ఉపసంహరణా ప్రక్రియలో ఒక దశ. ఆంతరిక చేతన లోనికి పోయినపుడు, శాశ్వతమైన ప్రశాంతతగల, చలనరహితమైన, బాహ్య ప్రకృతి నుండి విడివడినదై ఎట్టి కదలికలు లేని సుస్థిర, శుద్ధసత్ గా అది అనుభవాని కొస్తుంది. చలనాల నుండి విడవడిపోయినందువల్ల, వాటి నుండి వెనుదగ్గి నిలబడినందువల్ల ఈ అనుభవం ప్రాప్తిస్తుంది. ఇది సాధనలో చాలా ముఖ్యమైన ఘట్టం. దీని తొలి ఫలితం సంపూర్ణ ప్రశాంతత, కాని తర్వాత ఆ ప్రశాంతత (ప్రశాంతత లుప్తం గాకుండానే) బాహ్య జీవితం, స్వభావాల వెనుక యధార్థమైన ఆంతరిక మరియు ఆధ్యాత్మిక జీవితాన్ని సృజించు చైత్య మరియు తదితర ఆంతరిక చలనాలతో నిండిపోవడం మొదలౌతుంది. అప్పుడు బాహ్యజీవితాన్ని, స్వభావాన్ని నియంత్రించడం, పరివర్తన చెందించడం తేలికౌతుంది.

మూలం: శ్రీ అరవిందులు

అనువాదం: కె. వి. రావు

అంతరంగం వైపు తిరగడానికి సంబంధించిన సందేహ నివృత్తి

అంతరంగంలోనికి పయనించడమంటే అంధకారంలోనికి, శూన్యంలోనికి ప్రవేశించడమా?

భౌతికవాది తన దృష్టిని అంతరంగం లోనికి మళ్లించలేడు. అంతర్ముఖుడు కాలేడు. పైగా అతడు అంతర్ముఖుల బహిర్ముఖుల మధ్య అడ్డుగోడలు నిలుపుతుంటాడు. బాహ్యజీవనుల వైఖరి మాత్రమే సురక్షితమైనదని సమర్థిస్తుంటాడు. అంతరంగంలోనికి వెళ్లడం అంటే అంధకారంలోకి వెళ్లడం లేదా శూన్యంలోకి వెళ్లడం లేక సచేతనలోని సమతుల్యాన్ని కోల్పోయి అస్వస్థత పాలవడం అంటాడు. కాని బాహ్య జీవనం సహాయ సహకారాలతోనే ఆంతరిక జీవననిర్మాణం జరుగుతుంది. బయటి ప్రపంచపు నిర్దిష్ట ఆరోగ్యప్రదమైన పోషకమూలాల పైనే దాని స్వస్థత ఆధారపడి ఉంటుంది. నిజానికి వ్యక్తిగతమైన మనిషిలోని మానసికతకూ అతని జీవనానికీ మధ్య ఉండే సమతులనం భద్రంగా ఉండేది ఒక సుస్థిర బాహ్య, జీవన, వాస్తవికత ఆధారం పైనే. ఎందుకంటే భౌతిక ప్రపంచం మాత్రమే ఏకైక ప్రాథమిక అభివ్యక్త సత్యం కనుక. ఇది భౌతిక మానవుని పట్ల బాహ్యజీవితాన్నే జీవించేవాని పట్ల సత్యమే. అతడు బాహ్యప్రకృతికి సంబంధించిన ఒక జీవి ననుకుంటాడు. ఆమెతో తయారు చేయబడి ఆమెపై ఆధారపడినవాడి ననుకుంటాడు. అతనికి ఒక ఆంతర జీవితం గాని, ఆంతరిక అస్తిత్వంగాని లేనందున అతడు తన అంతరంగం వైపు పయనిస్తే తనను తాను కోల్పోతాడు. అయితే ఈ ప్రత్యేక దృష్టితో చూస్తే అంతర్ముఖుడైన మనిషికి కూడా ఆంతరిక జీవితం లేదు. నిజమైన ఆంతర ఆత్మను చూచిన, ఆంతరిక విషయాలను దర్శించిన ద్రష్ట కాదతడు. అల్ప మానసిక మానవుడు తన లోని, దాన్ని పైనే చూస్తాడు. అతడు తన జీవన అహాన్ని, మానసిక అహాన్నే చూస్తాడు గాని, తన అధ్యాత్మిక ఆత్మను కాదు. అందుకే అతను క్షుద్ర, దయనీయ స్థితిలోని జీవి యొక్క అనారోగ్య చలనాలతో నిండినవానిలా తయారౌతాడు. వాస్తవిక ఆంతర జీవితం లేనందున, సదా ఉపరితలంలోనే జీవించిన మనస్తత్వం ఆంతరంగం వైపు చూస్తున్నపుడు దాని ప్రథమ ప్రతిస్పందన, ఆంతరిక అంధకారాన్ని చూచిన భావనగా లేక అనుభవంగా ఉంటుంది. తన మనుగడ కోసం బాహ్య ప్రపంచపు

వస్తుతలిపై ఆధారపడే మనస్తత్వానికి దక్కేది స్వయంనిర్మిత ఆంతరిక అనుభవమే, కనుక అతనికి కూడా అంతరంగ జీవనమనేది ఉండదు.

కాని ఎవరి వైయక్తిక అస్తిత్వంలోకి గాఢమైన అంతరంగ నిజజీవన చైతన్యం ప్రవేశిస్తుందో, ఎవరు అందులో నిజంగా అధికంగా జీవిస్తుంటారో వారికి లోపల అంధకారం, లోని జడశూన్యత దర్శనమీయవు. వారికి ఒక జీవన వైశాల్యత, ఒక నవజీవన అనుభవ ఉధృతి, ఒక గొప్ప దృష్టి, ఒక బృహత్తర సమర్థత అనుభవం లోకి వస్తాయి. సాధారణ భౌతిక మానవత తనకు తానుగా తయారుచేసుకొన్న జీవనాన్ని మించిన అనంతంగా అధికమైన మరింత నిజజీవన కాలం పొడిగించబడుతుంది. పైపై జీవిస్తున్న మానసికజీవి గాని లేక ప్రాణికజీవిగాని తమ సక్రియ ప్రాణికశక్తి మరియు కార్యకలాపం వల్ల లేదా మానసిక జీవితం యొక్క సూక్ష్మగ్రాహ్యత, విస్తారత వల్ల, బాహ్యప్రాణికంలో లేదా ఉపరితలంలో నివసించే మానసిక మనిషి పొందగలిగిన ఆనందం, అదెట్టిదైనా, దానిని మించిన విశాలమైన, సమృద్ధమైన ఆనందాన్ని, జీవిస్తున్నందువల్ల ఆనందాన్ని, వారు పొందుతారు.

ఒక నిశ్చల నీరవత, ఒక విశాలమైన, సమృద్ధమైన, అనంతమైన శూన్యం లోకి ప్రవేశం కూడా మన అంతరంగ ఆధ్యాత్మిక అనుభవంలోని ఒక భాగమే. ఈ శూన్యానికి ఈ మౌనానికి భౌతికమానసం ఒకింత జంకుతుంది. అల్పమైన, ఉపరితలంలో చురుకుగా ఉండే, చింతనశీలియైన లేదా ప్రాణిక మనస్సు దాని నుండి ముడుచుకుపోతుంది, లేదా దానిని ఇష్టపడదు. ఎందుకనంటే అది నిశ్చల నీరవతను, మానసిక ప్రాణిక అసమర్థతగా అనుకొంటుంది. శూన్యాన్ని నశించిపోవండగా, ఉనికిని కోల్పోవడంగా అపార్థం చేసుకొంటుంది. ఈ నిశ్చల నీరవత గొప్ప జ్ఞానానికీ, శక్తికీ, ఆనందానికీ అవసరమైన నిశ్చల నీరవత. ఈ రిక్తత మన సహజ అస్తిత్వపు కలశాన్ని ఖాళీ చేసే రిక్తత. భగవంతుని మధువు నింపేందుకు మన జీవన పాత్రలోని మాలిన్యాల నుండి, సహజ అస్తిత్వాన్ని ముక్తం చేయడం. ఒక మహత్తర ఉనికిలోకి సాగిపోయే మార్గం ఇది.

అంతరంగంలోనికి తిరగడం వల్ల వైయక్తిక ఆత్మలో చిక్కుకుపోతామా? నిజానికి ఈ విధంగా లోనికి తిరగడం, ఈ అంతర్ముఖ గమనం వైయక్తిక ఆత్మలో చిక్కుకుపోవడం కాదు.

ఇది నిజమైన విశ్వజనీనత వైపుకు వేసే మొదటి అడుగు. ఇది మన బాహ్య,

ఆంతరిక మనుగడకు గల సత్యాన్ని మన కందిస్తుంది. ఎందుచేతనంటే, ఈ ఆంతరిక జీవనం తనను తాను విస్తరింపజేసుకొని విశ్వజీవనాన్ని ఆలింగనం చేసుకొనగలదు. మన ఉపరితల చేతనకు ఏవిధంగానూ సాధ్యం కాని, దానిని మించి ఎంతో మహనీయమైన సత్యం మరియు సక్రియాశక్తితో అది సమస్తం యొక్క జీవనంతో సంబంధం పెట్టుకొంటుంది, అందులోనికి చొచ్చుకుపోతుంది. పైకి ఎంతో గొప్పగా కన్పించే వైశ్వీకరణ అంతా ఒక ఆశించిన ఫలితాన్నివ్వని కుంటినడక లాంటి ప్రయాస. అదొక సంరచన వాస్తవమని నమ్మించే ఆభాసే. వాస్తవ విషయం కాదు. ఎందుచేతనంటే ఈ ఉపరితల చేతనలో మనం ఇతరుల నుండి మనలను విడగొట్టుకొని అహం అనే సంకెళ్లు తగిలించుకొన్నాం, ఆ స్థితిలో మనం మన నిస్వార్థత అనుకొన్నదే తరుచుగానే కాదు చాలా యెక్కువగానే మన స్వార్థపరత యొక్క సూక్ష్మరూపమౌతుంది. లేదా మన అహం మరింత గొప్పగా తనను ధృవీకరించుకోవడంగా మారుతుంది. పరహితం కోసం పనిచేస్తున్నామని చూపుకొంటూ పరహితార్థమైన పనిచేయడంతో సంతృప్తిచెంది మన అహాన్ని విస్తరింపజేసుకోవలసిన అవసరార్థం, విస్తృతం చేసిన మన పరిధిలోనికి మనం స్వీకరించిన ఇతరులపై మన వ్యక్తిగత తత్వాన్ని, మన భావాలను, మన మానసిక, ప్రాణిక మూర్తిత్వాలను విధించేందుకు అదొక తెర అని మనం చూడలేకపోతున్నాం. విజయులమైనాం గనుక ప్రేమ, సానుభూతిగల ఆధ్యాత్మికశక్తితోనే ఇంతవరకూ కూడా ఇది సాధ్యమయింది. కాని మనలోని ఈ శక్తి సార్థక్యతకు సంబంధించిన శక్తిక్షేత్రం, దానిని ప్రేరేపించే చైత్య ఉద్యమం అసంపూర్ణమైనవి. దాని చర్య అజ్ఞానమయమైనది. కారణం దానికి మన మనసుతోనూ హృదయంతోను సంపర్కం వుంది. కాని (సత్తు) మన అస్తిత్వం ఇతరుల అస్తిత్వాన్ని తనదిగా చేసుకోలేదు. ఇతరులతో బాహ్య ఐక్యత ఎప్పుడూ బాహ్యసంబంధమైన కలయిక, బాహ్యజీవితాల సాహచర్యమే వాటివల్ల ఆంతర ఫలితం చాలా తక్కువ. బాహ్యజీవితంలో మనం కలుసుకునే సామాన్య జీవనం మరియు జీవులకు మనస్సు, హృదయం తమ చలనాలను ముడి పెడ్తాయి. కాని సర్వసామాన్య బాహ్యజీవనం పునాదిగా వుండిపోతుంది. మానవుల పరస్పర అజ్ఞానం, వైషమ్యపూరిత అహంకారాలు, మనసులలో సంఘర్షణ, హృదయాలలో సంఘర్షణ, ప్రాణిక ప్రవృత్తుల సంఘర్షణ, స్వప్రయోజనాల సంఘర్షణలు ఎన్ని ఉన్నప్పటికీ ఆంతరికం వైపు సాగే ఏకత్వ నిర్మాణం లేదా అట్టి ఏకత్వానికి సంబంధించినది ఎంతైనా అది ఒక పాక్షిక,

అభద్ర, పై పై నిర్మాణమే. అప్పుడు ఆధ్యాత్మిక చేతన ఆధ్యాత్మిక జీవనం ఈ నిర్మాణ సూత్రాన్ని వెనక్కి మళ్ళిస్తుంది. ఒక ఆంతరికానుభవాన్ని , తన అస్తిత్వంలో ఇతరులను కూడా చేర్చుకొనడం ద్వారా ఏకత్వపు ఆంతరికార్థం మరియు వాస్తవికతను ఆధ్యాత్మిక జీవితం తన కర్మకు ఆధారంగా చేసుకొంటుంది. ఆధ్యాత్మిక వ్యక్తి ఆ ఏకత్వ భావన నాధారం చేసుకొని కర్మ చేస్తుంటాడు. ఇతర ఆత్మ పై తన ఆత్మకుగల అభ్యర్థనకు సంబంధించిన జీవనావసరానికి సంబంధించిన, శుభానికి సంబంధించిన, ప్రేమసానుభూతులతో యదార్థంగా చేయవలసిన పనిని గురించిన తక్షణ మరియు ప్రత్యక్ష అవగాహన దాని వల్ల అతనికి లభిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ఎన్. రామస్వామి

చేయవలసింది ఇంకా చాలా ఉంది

(భూరి కర్త్వం : ఋగ్వేదం 1.10.2)

మన నిజ ఆత్మ వ్యక్తిగత మానసిక సత్త కాదు, అది కేవలం ఒక మనోచిత్రం, ఒక ఆకారం. నిజ ఆత్మ విశ్వవ్యాప్తము, అనంతము, సమస్త సృష్టితో ఒకటి అయినది. అన్ని స్థితులలోను తన ఉనికిని చాటునది. మన మనోప్రాణదేహాల వెనుకనుండే ఆత్మ, మన సహజీవుల మనోప్రాణదేహాల వెనుక నుండే ఆత్మయూ ఒక్కటే. ఆ ఆత్మను మన స్వాధీనంలో నుంచుకొని సహజీవుల నందరిని మరోసారి చూచినప్పుడు, మన చేతన యొక్క సమిష్టి ఆధారంలో వారితో ఏకమగుటకు మొగ్గుచూపుతాము. మనసు అలాంటి తాదాత్మ్యతను వ్యతిరేకిస్తుందనుట సత్యము. దాని పాత అలవాట్లను కార్యకలాపాలను కొనసాగించుటను మనం అంగీకరిస్తే, మన నూతన అనుభవం పైన మన ఆత్మ పైన తన అసంగత పరదాను ఆచ్ఛాదింప ప్రయత్నిస్తుంది తప్ప, తనకు తానుగ విషయాలను సత్యమైన, నిత్యమైన భవిష్యదృష్టితో గమనించు టకు ఇచ్ఛగించదు. కాని, మొదట్లోనే మనం యోగమార్గంలో సక్రమంగా కొనసాగి ఉంటే, పవిత్రీకరించబడిన మనసు, హృదయం ద్వారా పరమాత్మను పొందగలిగె వాళ్ళం. పవిత్రీకరింపబడిన మనసు తప్పక సాత్త్వికంగా జ్ఞానానికి ఉన్మీలనమై

ఉంటుంది. రెండో విధంగా మనసుకు కూడా పరిమితికి, విభజనకు లోనయ్యే లక్షణ మున్నా, అందువలన సంభవించే అస్తవ్యస్త ఆలోచనా విధానానికి బదులు దానికి ఏకత్వానికి దారితీసే పరమసత్య సామంజస్యతను గురించి ఆలోచించడం అలవరచ వచ్చు. అందువలన ధ్యానము, ఏకాగ్రతల ద్వారా వస్తువులను, జీవులను వేటికవి ప్రత్యేకత కలిగి ఉన్నవిగ పరిగణించుట మాని, సర్వత్రా ఉన్న ఆ దైవాన్ని గురించి మాత్రమే యోచించుటను సర్వమూ ఆ దైవమేనని తలచుటను మనసుకు అలవాటు చేయాలి. ఇదివరలో జ్ఞానసముపార్జనకు మొదటి ఆవశ్యకత జీవుడు అంతర్ముఖుడగుట అని, దానినే లక్ష్యంగా అనుసరించాలని చెప్పుకున్నా, సమగ్రయోగ సాధకుడు ఈ రెండు గమనాలను జతగా పాటించడం మంచిది. ఒకదానితో అతడు తనలోని ఆత్మను దర్శించగలుగుతాడు. రెండవదానితో ప్రస్తుతం మనకు బాహ్యంగా నున్నట్లు కనుపించే ఆత్మ, అందరిలోను ఉన్నదని గ్రహించగలుగుతాడు.

(SABCL 20: p. 354)

*

ఈ దృష్టితో పరిశీలిస్తే స్వచ్ఛమైన, ప్రశాంతమైన ఆత్మను దేనినైతే మనోప్రాణదేహాల బంధము నుండి విడివడి పొందగలిగామో, ఆ సముపార్జన కేవలం మనకొక మహోన్నత సాక్షాత్కారానికి ఆధారాన్ని సమకూర్చుకొనుట అవుతుంది. అందువలన ఆ ప్రక్రియ మన యోగానికి సరిపోదు. మరింతగా సమాలింగకమైన మరేదో దృఢమైన ప్రయత్నం అవసరం అవుతుంది. మన ఆత్మ నుండి విడివడి స్వయాస్థితము, స్వయం చేతనమైన బ్రహ్మము లోనికి ప్రవేశించి నందున, మన మనోప్రాణ దేహాలను బ్రహ్మము యొక్క విశ్వవ్యాప్తమైన స్వయంస్థితి, స్వయంచేతన, ఆత్మానందాలతో సహా తిరిగి పొందాలి. విశ్వఖేలనతో ముడివడని స్వచ్ఛమైన స్వయం స్థితిని పొందుటయే గాక సృష్టినంతా మనదానిగా వశపరచుకోవాలి. దేశకాల స్థితుల మార్పులకు అతీతమైన, ఒక అనంత నిరహంకార చైతన్యానికి చెందినవారముగ తెలుసుకొనుటయే గాక దేశకాలాలలోని చైతన్యపు వెల్లువతోను, దాని సృజనాత్మకశక్తితోను ఏకం కావాలి. ఒక అంతులేని శాంతిని, నిశ్చల నీరవతలను అనుభవించుటయే గాక విశ్వగత విషయాలలో స్వేచ్ఛా యుత అనంత ఆనందాన్ని కూడ అనుభవించగలగాలి. ఎందుచేతనంటే ఆ స్వచ్ఛమైన ప్రశాంతతయే సచ్చిదానందము. అదియే బ్రహ్మము.

(SABCL 19 : p. 891)

*

ఒక సర్వోత్కృష్ట అభివ్యక్త సత్యానికై ఆతనిని జాగృతం చేయడం, తన నుండి, లేదా శాశ్వతుని మహాశక్తిగా తనకు తాను మారువేషం వేసుకొన్న అవిద్య నుండి, జీవి యొక్క మరెక్కడో ఉన్న ఒక ఉన్నత స్థితిలోనికి అతనిని నిష్క్రమింపజేయడం ద్వారా, విడుదల కలిగించడమో గనుక, ఆధ్యాత్మిక మానవ పరిణామంలో విశ్వప్రకృతి ఏకైక చరమ లక్ష్యం అయినట్లైతే, ఈ పరిణామంలోని ఈ అడుగు ఒక ముగింపు, ఒక నిష్క్రమణ అయినట్లైతే, మొత్తం మీద సారతః ఆమె కార్యం నిర్వహించబడినట్లే, ఇంక ఆమె చేయవలసిందేమీ లేనట్లే. మార్గాలు ఏర్పాటు చేయబడ్డాయి, వాటిని అనుసరించగలిగే శక్తిసామర్థ్యాలు సమకూర్చబడ్డాయి, అంతిమ గమ్యం లేక సృష్టి యొక్క అంతిమ శిఖరాగ్రం ప్రకటితమయ్యింది. మిగిలిందల్లా ప్రతి ఒక అంతరాత్మ వ్యక్తిగతంగా తన పురోభివృద్ధిలో సరైన స్థాయిని లేక మలుపును చేరి, ఆధ్యాత్మిక మార్గాలలోకి ప్రవేశించి, స్వయంగా ఎంచుకున్న మార్గం ద్వారా ఈ నిమ్నస్థితిని అధిగమించుటయే. కాని అంతకంటె ఎంతో దూరాన ఉన్న లక్ష్యాన్ని మరి మనం అదివరకే ప్రతిపాదించుకొన్నాం. అది కేవలం ఆత్మ ఆవిష్కారమే కాదు, ప్రకృతి యొక్క సమూలమైన సమగ్ర పరివర్తన. ఆత్మ యొక్క వాస్తవమైన సజీవాకృతిని సాక్షాత్కరింపజేయగల సంకల్పం ప్రకృతికి ఉన్నది. అవిద్య నుండి విద్యలోనికి పయనించటం ద్వారా ఆమె ప్రారంభించినదాన్ని ఫలవంతం చేయాలనే ఇచ్ఛ ఆమెకున్నది. ముసుగును తొలగించి తనలో శాశ్వత సత్ మరియు విశ్వజనీన ఆనందాలు కలిగివున్న ప్రకాశమయ చిత్ శక్తిగా తనను తాను వ్యక్తపరచుకొనగల సంకల్పం ఆమెకున్నది. దాని వలన ఇంకా నెరవేర్చబడనిది ఏదో ఉన్నదనే విషయం తేటతెల్లమౌతుంది. ఇంకా ఎంతో చేయవలసి ఉన్నదేదో అది స్పష్టమౌతుంది — 'భూరి అస్పష్ట కర్తవ్యం'. అధిరోహించవలసిన ఒక ఉన్నతస్థితి ఇంకా ఒకటి ఉంది. దృష్టి సారించవలసిన, సంకల్పం తన రెక్కలను విస్తరించవలసిన విస్తృత పరిధి ఒకటుంది. పదార్థ జగత్తులో ఆత్మ తనను ధృవీకరించుకొనవలసిన విస్తృత పరిధి ఇంకా ఎంతో ఉంది.

(SABCL 19 : pp. 889-90)

*

ఇదివరలో మనం చూచాయగ చర్చించిన త్రివిధ రూపాంతరీకరణ ద్వారా మాత్రమే ఇది సాధ్యపడుతుంది. మొట్టమొదట చైత్యపరివర్తన జరగాలి. మన ప్రస్తుత స్వభావ

మంతా అంతరాత్మ యొక్క సాధనా పరికరంగ మారాలి. దాని పిదప లేక దానితోపాటు ఆధ్యాత్మిక మార్పు చోటుచేసుకోవాలి. అస్తిత్వం అంతటా ఒక ఉన్నత దివ్యకాంతి, దివ్యజ్ఞానం, దివ్యశక్తి, దివ్యక్రియాశక్తి, దివ్యానందం, దివ్య పరిశుద్ధత దిగి రావాలి. ప్రాణ శరీరాల అట్టడుగు లోతుల్లోకి, ఉపచేతన యొక్క చీకటి క్షేత్రాల్లోకి కూడ ఇవి చొచ్చుకపోవాలి. చివరిగ, అతిమానసిక ఉత్పరివర్తన సంభవించాలి. దీనికి మకుటాయమానంగా అతిమనస్సు లోనికి అధిరోహణ, మన అస్తిత్వమంతటి లోనికి, మన ప్రకృతి అంతటి లోనికి అతిమనస్సు యొక్క రూపాంతరీకరించు అవరోహణ జరగాలి.

(SABCL 19 : p. 891)

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ఇదే మన నిజమైన ఆత్మ

దివ్యసూర్యుని వైపు కనులెత్తి చూడు. అతడున్నాడక్కడే జీవశక్తి, జ్ఞానకాంతుల వైభవోపేత అద్భుత హృదయంలో. అపరిమేయ నిశ్చలనీరవతలో శాశ్వతుని పవిత్రమైన బహు నెగళ్ళుగా మిరుమిట్లుగొలుపుచున్న అసంఖ్యాక నక్షత్రరాశులను నిశీధిలో పరికించు. అది శూన్యం కాదు, మహాద్భుత సృష్టి స్పందనలతో నిండివున్నదది. అక్కడే చూడు ఓరియన్‌ను పట్కా కత్తులతో ప్రకాశిస్తున్న ఓరియన్‌ను; పదివేల సంవత్సరాలకు ముందు — ఆర్య శకారంభంలో — ఆర్యుల తండ్రులకు ప్రకాశిస్తున్నట్లే ప్రకాశిస్తున్న, ఓరియన్‌నుచూడు; అలాగే చూడు వైభవంతో అలరారుతున్న ఓరియన్‌ని. అలాగే — ఆకాశ సముద్రంలో — కోటానుకోట్ల మైళ్ళు దూరాన, తేలియాడుతూ సాగుతున్న లైరాని చూడు; జ్ఞాపకముంచుకో — ఈ అసంఖ్యాక ప్రపంచాలు — (వీనిలో చాలా ప్రపంచాలు మన ప్రపంచం కన్న ప్రచండ బల సంపన్నమైనవి) వర్ణించలేనంత వేగంతో పరిభ్రమిస్తున్నవి — పురాణ పురుషుని కనుసైగతో; కాని, ఎచటికో ఎవ్వరికో తెలియదు — ఆతనికి తప్ప. అయినను అవి నీ హిమాలయముల కన్న శతసహస్ర కాలాల పురాతనమైనవి; మీ కొండల పునాదుల కన్న ఎంతో

సుస్థిరమైనవి; అవి అలానే ఉంటాయి — ఆతడు తన ఇచ్ఛతో వాటిని విదిలించుకునేవరకు. నిరంతంరం ఉండే విశ్వవృక్షం — తన కృశించిన ఆకులను విదిలించుకున్నట్లు భావన చెయ్యి, గ్రహించు కాలం యొక్క అంతంలేనితనాన్ని; గ్రహించు — ఆకాశం యొక్క హద్దులు లేనితనాన్ని. ఈ ప్రపంచాలు లేనప్పుడు, ఆతడు ఉండెను; అదే ఆతడు ఇప్పటి వలె, ఈ ప్రపంచాలు లేనప్పుడు కూడా 'ఆతడు' ఉంటాడు. అదే 'ఆతడు' ఇంకా ఇప్పటి వలెనే, 'లైరా' కావల ఉన్నాడు, అని గ్రహించు. ఆకాశంలో దూరంగా — దక్షిణ క్రాస్ గా పిలువబడే నక్షత్రరాశి కనబడని చోట, ఇంకా ఆవల కూడ — 'ఆతడు' న్నాడని గ్రహించు. అక్కడి నుండి భూమికి తిరిగివచ్చి — ఈ 'ఆతడు' ఎవరో నిజం చేసుకో. అతను నీకు అత్యంత సమీపాన ఉన్నాడు. అల్లంత దూరాన వున్న వృద్ధుని చూడు; తన చేతికర్ర ఊతంతో వంగి నీ ప్రక్క నుండి పోతున్న వృద్ధుని చూడు. అలా పోతున్నది భగవంతుడే అనే నిజాన్ని గ్రహించావా? అక్కడ ఎండలో, నవ్వుతూ, పరుగిడుతున్న బాలుని చూడు; ఆ నవ్వు ఆతడిదిగా వినగలిగావా? కాదు, ఆతనింకా అంతకంటె దగ్గరగా ఉన్నాడు నీకు; ఆతడున్నాడు, నీలో; అతడే నీవు. అక్కడ, శతసహస్ర మైళ్ళ దూరంలో, అనంతాకాశ సీమల్లో, ప్రజ్వలిస్తున్నది నీవే. ఎగసిపడ్తూ సాగే (కెరటాల) ఘోషతో కూడిన, అనంతాకాశ సముద్రంపై, నిబ్బరంగా అడుగులేస్తూ నడుస్తున్నది నీవె; నక్షత్రాలను ఆయా స్థానాలలో ఉంచినది, నీవె; నీ యోగంతో — ఆ నిశ్చల నీరవ, నిర్వ్యక్తిక, నిష్క్రియ, ఇచ్ఛాశక్తితో; అదే నిన్నీ రోజు — నాలో నిన్ను (విశ్వాత్మను: అను) నీవే (జీవాత్మ — నీ శరీరానికి పరిమితమైన జీవాత్మ: అను) వింటూ ఉండేటట్లు సుస్థిరం చేసింది. సనాతనయోగ సంతానమా నీ వింకెంత మాత్రం వణికిపోయేవాడివిగా సందేహించేవాడివిగా ఉండవద్దు; భయపడకు, సందేహించకు, దుఃఖించకు. ఎందుకంటే — బాహ్యంగా కనబడే — నీ శరీరంలో ఉన్న ఏకైకుడు ఒక్క శ్వాసతో ఈ ప్రపంచాలను సృష్టించగలడు, లయం చేయగలడు.

అవును ఈ సమస్తమందు, పరిమితులులేని ఒక ఆధ్యాత్మికశక్తి సముద్రంలా ఉన్నాడు ఆతడు. ఎందుకంటే, ఆతడే లేకపోతే బాహ్యంగా కనబడే 'నీవు' కాని 'నేను' కాని, ఈ సూర్యుడు కాని, ఈ సమస్త లోకాలు కాని — కనురెప్ప మూతపడేందుకు పట్టే కాలంలో శతసహస్రాంశ కాలమైనా — నిలిచి ఉండలేవు. కాని, వీని కావల కూడ ఆతడున్నాడు. తన అభివ్యక్తిలో దాని నధిగమించి ఉన్నాడనే అర్థంలో

ఉన్నాడు. అతని అనభివ్యక్త స్థితిలో కూడ అతడు, సంపూర్ణంగా, దాని బయటే ఉన్నాడు. మరోదాని కన్నా ఈ సత్యాన్ని గ్రహించడం, ఇంకా ఎక్కువ కష్టం. కాని దీనిని గ్రహించడం అవసరం. ఈశ్వర సర్వగతత్వవాద మొకటున్నది. అది ఈ జగత్తును భగవంతుడుగా చూస్తుంది. కాని భగవంతుని జగత్తుగా చూడదు. జగత్తే భగవంతుడైతే, భగవంతుడొక పదార్థం మాత్రమే. అతడు విభజించబడ గలడు; మార్పు చెందగలడు — ఒక వస్తువు మరో వస్తువులా, మరల అది మొదటి వస్తువుగా, ఇలా అనేక రకాల మార్పులు చెందగలదు గదా అంటుంది ఆ వాదం. కాని ఇవి మాత్రమే స్వతః భగవంతుడు కాదు. అవి ఛాయలలో ఉన్న భగవంతుడు ఆభాసలు. దీనినే అలంకారికంగా చెప్పాలంటే — ఇవన్నీ — షేక్స్పియర్ (కవి, నాటక రచయిత) మనసుకు సంబంధించిన ఛాయలు, కల్పనలు. షేక్స్పియర్ — తన నాటక ప్రపంచమంతటి కంటె విశాలమైనవాడు మాత్రమే కాదు; అతడు తన నాటక ప్రపంచం లోపల, వెలుపల, వాటికి దూరంగా — అవేవీ కాకుండా కూడ ఉన్నాడు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: యస్. వై. సోమయాజులు

5. అది కదులును, అది కదలదు. అది దూరంగా ఉన్నది, అదే దగ్గరగా నున్నది.అది సమస్తమందూ ఉన్నది, సమస్తానికీ బయటా ఉన్నది.
6. ఎవరైతే పరమాత్మను అంతటా, ఉన్న ఈ అన్నింటిలోనూ — అన్నిటినీ పరమాత్మలోనూ చూస్తారో. అతడు ఆ తరువాత కుంగిపోడు — దైనివల్లనైనా

Figment: నిజంలా కనపడే, నిజం కాని భావం, ఆలోచన.
Tumbling Billows పడిలేచే (సముద్ర) కెరటాల ధ్వని ఘోష